# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 201 | హైదరాబాద్ | శనివారం 31-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

కేరళలో పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించిన టీమిండియా సభ్యులు

## ఫిబ్రవరి 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు... 14న బడ్జెట్!




11లో

- నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగం
- ఫిబ్రవరి 14న వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల
- అదే రోజున వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించనున్న మంత్రి అచ్చెన్నాయుడు
- దాదాపు నాలుగు వారాల పాటు కొనసాగనున్న సమావేశాలు



11లో

## గద్దెలపై కొలువైన వనదేవతలు



- వెదురు కర్రలే దైవాలుగా... గద్దెలే గర్భగుడులుగ భక్తులకు దర్శనం
- కోట్లాది హృదయాలను ఏకం చేసిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర

## రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి..

### తొలి సీఎంగా చరిత్ర

- హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో లీడర్ షిప్ కోర్సును పూర్తి చేసుకున్న రేవంత్
- సర్టిఫికెట్ అందించిన హార్వర్డ్ అధ్యాపకులు
- శిక్షణలో సాధారణ విద్యార్థిలా గడిపిన రేవంత్




11లో



11లో

## పదేళ్లలో అమరావతి, గుంటూరు, విజయవాడ కలిసిపోతాయి: సీఎం చంద్రబాబు

- గుంటూరు జీజీహెచ్‌లో మాతాశిశు కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పీ4 కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ కోసం 'సంజీవని' ప్రాజెక్టుకు శ్రీకారం

## అసలు పని... ఇప్పుడే మొదలైంది

- కాకినాడ జేఎన్టీయూలో విద్యార్థులతో లోకేశ్ ముఖాముఖి కార్యక్రమం
- అన్ని రంగాల్లో ఏపీని నెంబర్ వన్‌గా నిలపడమే లక్ష్యమని స్పష్టీకరణ
- పాదయాత్ర అనుభవాలు ప్రభుత్వంలో అమలు చేస్తున్నామన్న యువనేత
- నైతిక విలువల కోసం చాగంటిని సలహాదారుగా నియమించామని వెల్లడి



11లో

## సిగాచి బాధితులకు పరిహారం.. ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం




11లో

- సిగాచి ఫార్మా ప్రమాద బాధితుల పరిహారంపై హైకోర్టు అసహనం
- ప్రభుత్వం తీరుపై ప్రధాన న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం



## వీధి శుభ్రం చేసే చేతులు.. ఐఐటీ శిఖరాలు చేరాలి

: ఆర్.వి కర్ణన్. ఐఏఎస్.

- పారిశుద్ధ్య కార్మికుల పిల్లల కోసం జీ.హెచ్.ఎం.సీ బాస్ 'బిగ్ ప్లాన్'
- రేపు ఐఐటీ హైదరాబాద్‌కు ఎక్స్‌పోజర్ విజిట్..
- కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ప్రత్యేక చొరవతో సరికొత్త ప్రయోగం:

12లో




ఒక ఊర్ల మురికి తుడిచేటోళ్ల పిల్లలు.. మురికి గల్లీలనే మిగిలిపోవాల్నా అని ఆలోచించిండు మన జీహెచ్ఎంసీ బాస్ కర్ణన్ సారు. "నగరాన్ని సాపు చేసే చేతులు.. రేపు దేశాన్ని ఏలేటోళ్లు కావాలే" అని మొండిగెల్వాని సంకల్పంతోటి, ఆ పిల్లలందరినీ ఐఐటీ హైదరాబాద్ దాకా తీసుకపోయే ప్లాన్ వేసిండు. "మా అయ్యా అమ్మలు రోడ్లు ఊడ్చొచ్చు గానీ.. మేము ఆకాశమంత ఎత్తుకు ఎగురుతం" అని ఆ పోరగాళ్లు సంతోష పడుతుంటే, సారు చేసిన పనికి నగరం నిలబడి సలాం కొడుతున్నది. పెద్ద చదువుల కలలు కనడానికి పేదరికం అడ్డం కాదని, ఆ చిన్నార్ల కళ్లల్లో ఆశల దీపం వెలిగించిన కర్ణన్ సారు నిజంగానే గరీబోళ్ల పాలిట దేవుడై నిలిచిండు. ఊడ్చే చేతులకు జ్ఞానాన్ని అద్ది, బతుకుల్ని మార్చే ఈ 'స్వచ్ఛ' ప్రయత్నం.. రేపటి బంగారు తెలంగాణకు అసలైన పునాది!

# మరో యుద్ధం తప్పదా...

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. వెనెజెవెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంతో రగిలిపోతున్న ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే ఇరాన్‌కు పలుమార్లు వార్నింగ్ ఇచ్చాడు. ఇక ఇప్పుడు వార్‌కు రెడీ అవుతున్నాడు. ఆయుధాలు మోహరిస్తున్నాడు. ఇప్పటికే పాకిస్తాన్ బలగాలను ఇరాక్ సరిహద్దుకు తరలించాడు. అమెరికా యుద్ధ విమానాలను రెడీ చేశాడు. తాజాగా అమెరికాకు చెందిన అబ్రహం లింకన్ వాహక నౌక ఇటీవల ఇక్కడికి చేరింది. దీనితో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ కూడా ఇరాన్‌కు తరలించాడు. పశ్చిమసియాలో మొన్నటిదాకా ఇజ్రాయిల్, పాలస్తీనా దేశాల మధ్య దాడులు కొనసాగేవి. ఈ రెండు దేశాల మధ్యలోకి ఇరాక్, సిరియా కూడా వచ్చాయి. దీంతో దాడులు మరింత పెరిగిపోయాయి. ఇప్పుడు అక్కడ పరిస్థితులు నెమ్మదిగా మారిపోతున్న వేళ.. పశ్చిమసియాలో మరోసారి యుద్ధ వాతావరణం ఏర్పడిందిఅమెరికాకు చెందిన యుద్ధ విమాన వాహన నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ పశ్చిమాసియా కు చేరుకోవడం కలకలాన్ని కలిగిస్తోంది. దీంతో ఇరాన్ పై అమెరికా దాడులు చేసే అవకాశం ఉందని ప్రచారం మొదలైంది.అబ్రహం లింకన్ యుద్ధ విమాన వాహక నౌక మాత్రమే కాకుండా, యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి యుద్ధ విమాన వాహక నౌకలు ఇరాన్ సరిహద్దుల్లోకి వెళ్లినట్టు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే అమెరికాకు చెందిన సెంట్రల్ కమాండ్ ఈ యుద్ధ విమాన వాహక నౌకలు అక్కడికి వచ్చాయని తెలిపింది.ఈ విమానాలు ఇరాన్ సరిహద్దుల్లోని అరేబియా సముద్రంలో ల్యాండ్ అవ్వలేదు. హిందూ సముద్రంలో అవి దిగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది మాత్రమే కాకుండా యుద్ధ విమానాలను, కార్గో విమానాలను ఈ ప్రాంతానికి తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. కొంతకాలంగా ఇరాన్ దేశంలో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ఘర్షణలో జరుగుతున్న నేపథ్యంలో వేరాదిమంది ఇప్పటికే చనిపోయారు. అక్కడి ఆందోళనలకు ట్రంప్ బాసటగా నిలిచారు. ఒకవేళ అక్కడి ప్రభుత్వం ఆందోళనకారులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటే మాత్రం తాము రంగంలోకి దిగుతామని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యల తర్వాత అమెరికా సైన్యం భారీగా ఇరాన్ దిశగా వెళ్లడం రకరకాల సంకేతాలు ఇస్తుంది. ట్రంప్ ఆదేశాలు ఇచ్చిన మరుక్షణంలోనే ఇరాన్ మీద అమెరికా దాడి చేసే అవకాశాలు తెలుస్తోంది. మరోవైపు అమెరికాతో ఇరాన్ చర్చలు జరిపే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. చర్చలు ముందుకు సాగితే పరిణామాలు వేగంగా మారిపోతాయని అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు.యుఎస్ సెంట్రల్ కమాండ్ దీనిని నిర్ధారించింది. ప్రాంత స్థిరత్వం, భద్రతా కారణాల దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నామని తెలిపింది. ఈ నౌబల బృందం ఆరబియా సముద్రం సరిహద్దుల్లో మాత్రమే కాక, హిందూ మహాసముద్రంలో కూడా వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఫలితంగా, ప్రాంతంలో అమెరికా సైనికుల సంఖ్య గణనీయంగా పెరిగింది.పెంటగాన్ ఇంకా ఎక్కువ ఫైటర్ జెట్‌లు, సైనిక కార్గో విమానాలను ఈ దిశలోకి తరలించే యోచనలో ఉంది. ఇరాన్‌లో పొలిటికల్ అస్థిరతలు, ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో వేల మంది మరణించినట్లు అంచనా. ఆందోళనలకు మద్దతుగా నిలబడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రభుత్వం ఏమైనా కఠిన చర్యలు తీసుకుంటే జోక్యం చేసుకుంటామని హెచ్చరించారు. దీని ఫలితంగా భారీ సైనిక బలగాలను రెడీ చేస్తున్నామని ప్రకటించారు. ఇది రెండు దేశాల మధ్య ఉద్రిక్తాలను మరింత పెంచింది.ఒకవైపు యుద్ధ విమానాలు, నౌకలను మోహరిస్తున్న అమెరికా.. మరోవైపు ఇరాన్ చర్చలకు ముందుకు వస్తే తాము సిద్ధమని అమెరికా అధికారి తెలిపారు. వెనెజువెలాపై సైలెంట్ ఆపరేషన్ సక్సెస్ అయిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఈ క్రమంలో ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభంతో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. ఖమేనీ ప్రభుత్వాని మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు, ఈమేరకు హెచ్చరికల మీద హెచ్చరికలు చేస్తున్నాడు. దీంతో నిరసనకారులు కూడా అమెరికావైపు ఆశగా చూస్తున్నారు. గతంలో ఒకసారి దాడి చేసిన అమెరికా ఈసారి పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమవుతోంది.అమెరికా అబ్రహం లింకన్ యుద్ధ నౌకను ఇరాన్ దిశగా పంపుతోంది. శుక్రవారానికి సిద్ధంగా ఉండాలని ఇరాన్ నౌకలను అడ్డుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇజ్రాయెల్ దళాలు కూడా అలర్ట్‌లో ఉన్నాయి. దీంతో అమెరికా ఇరాన్ డోమ్ యాక్టివేట్ చేసి, ఎయిర్ స్ట్రైక్‌లకు సిద్ధపడుతోంది. అమెరికాతో కలిసి దాడికి ఇజ్రాయెల్ కూడా రెడీ అయింది.భూమిపై నుంచి దాడులు చేయకుండా ఎయిర్ స్ట్రైక్‌లు చేయాలని అమెరికా భావిస్తోంది. భూతల దాడులు చేస్తే ఐఆర్‌జీసీ అడ్డుకుంటుంది. అమెరికా సైనికులను చంపే ప్రమాదం ఉంది. అందుకే అమెరికా ఐఆర్‌జీసీని తీవ్రవాద సంస్థగా ప్రకటించింది. ప్రపంచ దేశాలతోనూ ప్రకటింపజేసి ఇరాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచింది.తాజా పరిణామాల నేపథ్యంలో చైనా సంచలన ప్రకటన చేసింది.

# ఫిబ్రవరిలో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన

విశాఖపట్టణం, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

విశాఖలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు శంకుస్థాపనకు ముహూర్తం ఫిక్స్ అయింది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధమయింది. భీమిలి నియోజకవర్గం పరిధిలోని ఆనందపురం మండలం తర్లు వాడలో 308 ఎకరాల భూమిని సిద్ధం చేసి త్వరలో గూగుల్ సంస్థకు అప్పగించనున్నారు. దాదాపు రైతుల భూములకు పరిహారం చెల్లింపులు పూర్తయ్యాయి. సింహాచలం భూముల కేటాయింపునకు సంబంధించిన ఫైలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరింది. బెంగళూరుకు చెందిన ఆర్ఎం జెడ్ కార్పొరేషన్ విశాఖలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. అయితే ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో ఇదివరకే ఒప్పందం చేసుకుంది. అయితే తాజాగా ఆ సంస్థ శంకుస్థాపనకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. ఫిబ్రవరిలోనే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన ఉంటుందని విశాఖ జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత సంస్థ సిద్ధంగా ఉన్నట్లు




చెప్పారు..ఆసియాలోని అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. కొద్ది నెలల కిందట ఏపీ ప్రభుత్వంతో గూగుల్ ఒప్పందం చేసుకుంది. అప్పటినుంచి రంగంలోకి దిగింది ఏపీ ప్రభుత్వం. ముఖ్యంగా భూముల సేకరణకు సంబంధించి వేగవంతం చేసింది. ఆనందపురం మండలం తర్లువాడ పరిసరాల్లో 308 ఎకరాల భూమిని సిద్ధం చేసింది. త్వరలో ఏపీఐఐసీ ద్వారా గూగుల్ కు ఆ భూములను అప్పగించునుంది. 51 మంది రైతుల నుంచి సేకరించిన భూములకు గాను 49 మంది రైతుల ఖాతాల్లో పరిహారానికి గాను డబ్బులు జమ చేశారు. మిగతా ఇద్దరు రైతులకు కూడా జమ చేస్తామని విశాఖ జిల్లా కలెక్టర్ తెలిపారు.అయితే ఈ గూగుల్ డేటా సెంటర్కు నీరు చాలా అవసరం. జీవీఎంసీద్వారా నీటిని అందించే పనులపై అధికారులు దృష్టి సారించారు. మరోవైపు సింహాచలం భూముల కేటాయింపులకు సంబంధించి ఫైల్స్ ను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రక్రియ పూర్తయితే డేటా సెంటర్ ఏర్పాటుకు కీలక అడుగు పడినట్టే. మరోవైపు ఫిబ్రవరిలోనే డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఐటీ సంస్థలు పెద్ద ఎత్తున విశాఖకు వచ్చే అవకాశం ఉంది. ఇటీవల దావోస్ పెట్టుబడుల సదస్సులో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఖీఓజి సంస్థతో ఒప్పందాలు చేసుకున్న సంగతి తెలిసిందే. దాదాపు లక్ష కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టనుంది సదరు సంస్థ. ఈ నేపథ్యంలో ఖీఓజి ప్రతినిధులు విశాఖ తో పాటు విజయనగరంలో పర్యటించారు. ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను పరిశీలించారు.

# అమరావతిలో మొదటి క్యాష్‌లెస్ టోల్ ప్లాజా

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలి టోల్‌గేట్ రెడీ అయింది. ఏపీ సచివాలయంకు వెళ్లే దారిలో వెంకటపాలెం గ్రామం వద్ద కొత్తగా నిర్మించిన విజయవాడ వెస్ట్ బైపాస్‌పై టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. ఇది దేశంలోనే మొట్టమొదటి క్యాష్ లెస్ టోల్ ప్లాజా అని ప్రచారంలో ఉంది. కేవలం డిజిటల్ పేమెంట్స్ లేదా



ఫాస్ట్ ట్యాగ్ ద్వారా మాత్రమే ఇక్కడ టోల్ ఫీజ్ వసూలు చేస్తారు. త్వరలోనే ఈ పద్ధతిని దేశంలోని అన్ని టోల్ ప్లాజాలలోనూ అమలు చేయబోతున్నారు. ప్రస్తుతానికి ఈ వెస్ట్ బైపాస్‌లో ఒకవైపు ట్రాఫిక్ పూర్తి స్థాయిలో మరోవైపు ట్రాఫిక్‌ను పాక్షికంగానూ వదులుతున్నారు. రెండు వైపులా బైపాస్ పూర్తిగా అందుబాటులోకి వచ్చాక అంటే మార్చి నెల టైమ్‌కి ఈ టోల్ ప్లాజాను మొదలు పెట్టనున్నట్టు తెలుస్తోంది.రాష్ట్ర విభజన, అమరావతిలో రాజధాని ప్రకటన తరువాత విజయవాడ నగరం పైనుంచి వెళ్లే ట్రాఫిక్ విపరీతంగా పెగిరి పోయింది. దీన్ని డైవర్ట్ చేయడం కోసం చెన్నై వైపు నుంచి వచ్చే వాహనాల కోసం కాజా టోల్ ప్లాజా దగ్గర నుంచి రాజధాని గ్రామాల మీదుగా గొల్లపూడి వరకూ 17.8 కిలోమీటర్లు కొత్త బైపాస్ వేశారు.

అక్కడి నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు వేరే మార్గంలో వెళ్ళిపోతాయి. అలాకాకుండా వైజాగ్ వైపు వెళ్లే వాహనాల కోసం అదే బైపాస్ మరో 30కిమీ వెళ్లి చిన్న అవుట్ పల్లి (గన్నవరం ఎయిర్ పోర్ట్ ) వద్ద హౌరా హైవేతో కలుస్తాయి. సో విజయవాడ సిటీలోకి వెళ్లే అవసరం లేకుండా మొత్తం 47.8 కిమీ బైపాస్ నిర్మించారు. దీన్నే విజయవాడ వెస్ట్ బైపాస్ అని పిలుస్తున్నారు. ఇది నేషనల్ హైవే 16 (ఔఊ 16)లో భాగం. దీని వల్ల అనవసర ట్రాఫిక్ ఎదుర్కోవాల్సిన అవసరం లేకుండా గమ్యస్థానాలకు వెళ్లేందుకు దూర ప్రాంత వాహన దారులకు ప్రయాణం ఈజీ అవుతోంది. ఈ హైవే మధ్యలో కృష్ణా నదిపై నిర్మించిన 3.1కిమీ ల బాహుబలి బ్రిడ్జ్ ఒక స్పెషల్ ఎట్రాక్షన్.విజయవాడ వెస్ట్ బైపాస్ మొత్తాన్ని అధునాతన టెక్నాలజీతో నిర్మించినట్టు హైవే అధికారులు చెబుతున్నారు. అయితే గతంలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ త్వరలోనే అసలు టోల్ ప్లాజాలే అవసరం లేకుండా ప్రయాణించిన దూరాన్ని బట్టి అమౌంట్ కట్ అయ్యేలా కొత్త విధానం తెస్తామని ప్రకటించారు. దీనవల్ల టోల్ గేట్‌ల వద్ద ఏర్పడే ట్రాఫిక్ కష్టాలు అస్సలుండవు అనేది వారి ఆలోచన. ఒకవేళ ఆ పద్ధతే అమల్లోకి తెస్తే అప్పుడు ఈ వెంకటపాలెం టోల్ ప్లాజా ఏమౌతుందని మరో చర్చ అది మొదలవక ముందే జనాల్లో నడుస్తోంది. ఏదేమైనా అమరావతి రాజధాని ప్రాంతంలో రోడ్డు కనెక్టివిటీ విపరీతంగా పెంచే ప్రయత్నం చేస్తున్న కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాల పనిలో భాగంగా అమరావతి లో ఏర్పాటైన తొలి టోల్ ప్లాజా గా వెంకటపాలెం టోల్ గేట్ వార్తలకెక్కింది.

# అభివృద్ధి బడ్జెట్...

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

ఏపీ బడ్జెట్‌కు రంగం సిద్ధమవుతోంది. ఫిబ్రవరి నెలలో రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 11 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు జరుగనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. సమావేశాల తొలి రోజున రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తరువాతి రోజు అంటే 12న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చ జరుగుతుంది. ఫిబ్రవరి 14న రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ (సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ శాఖకు సంబంధించిన బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు సమర్పించనున్నారు. 2024 జూన్ 12న రాష్ట్రంలో టీడీపీనేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత 2025లో తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గత బడ్జెట్‌లో మొత్తం వ్యయం మూడు లక్షల 22 వేల కోట్ల రూపాయలకు పైగా ఉండటం విశేషం. తొలిసారిగా రాష్ట్ర బడ్జెట్ మూడు లక్షల కోట్ల మైలురాయిని దాటింది. రాష్ట్ర ఆదాయం పెరుగుతుందన్న అంచనాలు, వివిధ రంగాల నుంచి వచ్చే ఆదాయంపై నమ్మకంతో ఆ బడ్జెట్‌ను రూపొందించారు.ఇప్పుడు రానున్న బడ్జెట్ గతాన్ని మించే అవకాశం ఉందని ఆర్థిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈసారి బడ్జెట్ పరిమాణం మూడున్నర లక్షల కోట్ల రూపాయల వరకు చేరవచ్చని చర్చ జరుగుతోంది. గత ఏడాది కాలంలో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం, పరిశ్రమలు ఏర్పాటు కావడం ఈ అంచనాలకు బలం చేకూరుస్తున్నాయి. అభివృద్ధికి సంబంధించి స్పష్టమైన యాక్షన్ ప్లాన్‌తో ప్రభుత్వం ముందుకెళుండటంతో వ్యయ పరిమాణం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఈసారి బడ్జెట్‌ను అభివృద్ధికి దిశానిర్దేశం చేసేలా రూపొందించనున్నట్లు సమాచారం. అన్ని వర్గాలకు సమానంగా మేలు చేసేలా కేటాయింపులు ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి గణనీయమైన నిధులు కేటాయించే అవకాశముందని అంచనా.

# అమిత్ షాతో పవన్ చర్చలు

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చాలా రోజుల తర్వాత ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. అయితే ఈ సారి ఆయన హస్తిన పర్యటనలో ప్రత్యేకత ఉంది. చాలా రోజుల తర్వాత ఢిల్లీ వెళ్లిన పవన్ కల్యాణ్ పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలసి పిఠాపురం రైల్వే స్టేషన్ వంటి అభివృద్ధి పనులపై చర్చించినప్పటికీ, ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పాటు పవన్ కల్యాణ్ ఎప్పుడు ఢిల్లీ వెళ్లినప్పటికీ ఆయన వెంట మంత్రి నాదెండ్ల మనోహర్ ఉండేవారు. కానీ ఈసారి మాత్రం ఒంటరిగానే పవన్ హస్తిన పర్యటన రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారి తీసింది.2019 ఎన్నికల్లో జనసేన ఓటమి తర్వాత పవన్ కల్యాణ్ అనేక సార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. పొత్తుల విషయంలోనూ, మరొక సమయంలోనూ ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యేవారు. ఆయన వెంట ఖచ్చితంగా నాదెండ్ల మనోహర్ ఉండేవారు. ఈసారి కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ సమయంలో నాదెండ్ల మనోహర్ లేకపోవడం ఒక రకంగా చర్చించాల్సిన అంశమేనంటున్నారు. అయితే అదే రోజు మంత్రి వర్గ సమావేశం ఉండటంతో నాదెండ్ల మనోహర్ ను తీసుకోకుండా ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్లారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. అక్కడ జనసేన కు చెందిన ఇద్దరు ఎంపీలు ఉండటం వల్లనే ఆయన పర్యటనలోనాదెండ్ల లేరని పార్టీ వర్గాలు అంటున్నాయి.మరొకవైపు పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అయితే రాజకీయ పరమైన అంశాలు ఎక్కువగానే వీరి మధ్య చర్చకు వచ్చినట్లు కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. ప్రధానంగా కూటమి బలోపేతంపై చర్చించడంతో పాటు నియోజకవర్గాల పెంపుదలపై కూడా వీరి మధ్య చర్చ జరిగినట్లు ప్రచారం జరుగుతుంది. ఈసారి పొత్తుల విషయంలో ఎక్కువ స్థానాలు తీసుకునేలా బీజేపీ, జనసేనలు వ్యవహరించనున్నాయన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో పవన్ కల్యాణ్, అమిత్ షాల భేటీ ఏపీ రాజకీయాల్లో మరొకసారి వేడెక్కింది.



రెండు జిరాఫీల దత్తత

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన మాతృమూర్తి అంజనా దేవి జన్మదినం సందర్భంగా ఒక గొప్ప సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విశాఖపట్నంలోని ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కును గురువారం సందర్శించిన ఆయన, అక్కడి రెండు జిరాఫీలను ఏడాది పాటు దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు.జిరాఫీల దత్తత: జూలో ఉన్న రెండు జిరాఫీల సంరక్షణ బాధ్యతలను స్వీకరించిన పవన్ కల్యాణ్, వాటికి సంబంధించి ఏడాది పొడవునా అయ్యే ఆహార, ఇతర నిర్వహణ ఖర్చులను తానే స్వయంగా భరిస్తానని వెల్లడించారు. ఈ మేరకు దత్తత పత్రాలను జూ అధికారులకు అందజేశారు.జంతువులతో సందడి: జూ పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్ అక్కడి ఏనుగులు, జిరాఫీలకు స్వయంగా ఆహారాన్ని తినిపించారు. వన్యప్రాణుల పట్ల ఆయనకున్న మక్కువను చూసి జూ సిబ్బంది, పర్యాటకులు సంతోషం వ్యక్తం చేశారు.కొత్త ఎన్‌క్లోజర్ ప్రారంభం: వన్యప్రాణుల సౌకర్యార్థం జూలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలుగుబంట్ల ఎన్‌క్లోజర్‌ను ఆయన ప్రారంభించారుజంతువుల సంరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్న వారు వన్యప్రాణులను దత్తత తీసుకుంటే జూ పార్కుల అభివృద్ధి సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

అమ్మ పుట్టినరోజున ఆడంబరాలకు వెళ్లకుండా ఇలా మూగజీవాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పవన్ కల్యాణ్ సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇచ్చారు.

# పవన్ ఎందుకు మౌనం

కడప, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

ఇటీవల జరిగిన విమాన ప్రమాదం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి చెందడం రాజకీయ వర్గాలనుగ్రాంతికి గురి చేసింది. వివిధ పార్టీల నేతలు సంతాపం తెలియజేశారు. ఈ క్రమంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న జనసేన



పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా మీడియా ముందుకు వచ్చి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. అజిత్ పవార్ మరణం చాలా బాధాకరమని, ఇది దేశానికి తీరని లోటని ఆయన వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ ముఖంలో ఆ సమయంలో స్పష్టమైన విషాదం కనిపించిందిఅయితే అదే సమయంలో మీడియా ప్రతినిధులు జనసేనకు చెందిన ఒక ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణల గురించి ప్రశ్నించారు. కానీ పవన్ కళ్యాణ్ ఆ అంశంపై స్పందించకుండా అక్కడినుంచి వెళ్లిపోయారు. దీనినే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దగా హైలైట్ చేస్తోంది. పవన్ కళ్యాణ్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని విమర్శలు గుప్పిస్తోంది. మరోవైపు జనసేన కార్యకర్తలు మాత్రం తమ నాయకుడు నిజంగా బాధలో ఉన్నారని, ఆ పరిస్థితిలో ఇతర అంశాలపై మాట్లాడకపోవడం సహజమేనని చెబుతున్నారు. అయినప్పటికీ ఈ వ్యవహారం రాజకీయంగా చర్చకు దారి తీసింది.రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అంశంలో జనసేన నాయకత్వం తీసుకున్న వైఖరిపై కూడా విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలపై ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకున్న ఉదాహరణలు ఉన్నాయి. కోనేటి ఆదిమూలంపై ఆరోపణలు వచ్చిన వెంటనే సస్పెన్షన్ వంటి నిర్ణయాలు తీసుకున్నారు. మరికొందరి విషయంలో విచారణ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు.అయితే జనసేన ఎమ్మెల్యే విషయంలో మాత్రం వివాదం చాలా రోజులుగా కొనసాగుతున్నా, పార్టీ స్థాయిలో స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సమస్యను మౌనంగా ఎదుర్కోవడం, దిద్దుబాటు చర్యలు ఆలస్యం కావడం వల్ల పార్టీకి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పవన్ కళ్యాణ్ ఎప్పుడూ విలువలు, నైతికత, మంచి పాలన గురించి మాట్లాడుతుంటారు. కానీ అదే సమయంలో జనసేన నేతలపై కూడా లైంగిక వేధింపుల వంటి ఆరోపణలు రావడం ఆయన లక్ష్యాలకు విరుద్ధంగా మారుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.మంచి పాలన అందించాలన్న పవన్ కళ్యాణ్ ఆశయాన్ని కిందిస్థాయిలో కొందరు నేతల వ్యవహారాలు దెబ్బతీస్తున్నాయనే భావన ఉంది. ఈ పరిస్థితి ఆయనను వ్యక్తిగతంగా కూడా కలచివేస్తోందని పార్టీ వర్గాలు అంటున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పార్టీ స్థాయిలో స్పష్టమైన విధానం, వేగవంతమైన చర్యలు అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అప్పుడే జనసేన ప్రజల్లో పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోగలదన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

# పార్టీకి భారంగా మారుతున్న వ్యక్తిగత తప్పులు

కడప, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

ప్రజా జీవితంలో ఉన్నవారు ప్రతి అడుగూ ఎంతో జాగ్రత్తగా వేయాల్సిన అవసరం ఉంటుంది. వారి వ్యక్తిగత ప్రవర్తన కూడా ప్రజల పరిశీలనలోనే ఉంటుందన్న సత్యాన్ని గుర్తించాలి. ఒక చిన్న తప్పు కూడా పెద్ద దుమారంగా మారే ప్రమాదం ఉంటుంది. ఈ వాస్తవాన్ని విస్మరిస్తే రాజకీయ జీవితం ఒక్కసారిగా కుదేలయ్యే పరిస్థితులు ఎదురవుతాయి. ప్రస్తుతం జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం ఇదే విషయాన్ని స్పష్టంగా చూపిస్తోంది.సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదగడం చిన్న విషయం కాదు. అలాంటి ఎదుగుదలతో పాటు హుందాతనం, బాధ్యత కూడా పెరగాలి. కానీ ఆ స్థాయికి తగిన ప్రవర్తన లేకపోతే అవకాశాలే శాపంగా మారుతాయి. అరవ శ్రీధర్ విషయంలో రాజకీయంగా వచ్చిన అవకాశాన్ని ఆయన సరిగా వినియోగించుకోలేకపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన చర్యల వల్ల ఆయనకు అవకాశం ఇచ్చిన పార్టీ కూడా ఇప్పుడు వివాదంలో చిక్కుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఆయనపై వచ్చిన వేధింపుల ఆరోపణలు, వాటికి సంబంధించిన వీడియోలు రాజకీయ వర్గాల్లోనే కాదు, సామాన్య ప్రజల్లోనూ చర్చకు దారితీశాయి. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వ్యక్తి మరింత సంయమనం పాటించాల్సి ఉంటుందన్న విషయం ఇలాంటి ఘటనలతో మరోసారి గుర్తుకు వస్తోంది. సమాజం మొత్తం తన వైపే చూస్తుందన్న భావన ఉంటేనే వ్యక్తి తన ప్రవర్తనను అదుపులో ఉంచుకుంటాడు.ఇలాంటి ఘటనలు కేవలం వ్యక్తిగత స్థాయిలోనే కాదు, రాజకీయ పార్టీల ప్రతిష్ఠను కూడా ప్రభావితం చేస్తాయి. జనసేన విలువలతో కూడిన రాజకీయాలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చింది. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, నైతికత గురించి ఎప్పటికప్పుడు మాట్లాడుతుంటారు. అలాంటి పార్టీకి చెందిన ఎమ్మెల్యేపై ఇలాంటి ఆరోపణలు రావడం పార్టీకి ఇబ్బందికరమే. ఇదే సమయంలో ప్రతిపక్షాలు దీనిని రాజకీయంగా ఉపయోగించుకోవడం సహజమే.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలోనూ గతంలో పలువురు నేతలపై ఆరోపణలు వచ్చాయి. అయితే వాటిపై పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పెద్దగా స్పందించలేదన్న విమర్శలు ఉన్నాయి. అప్పట్లో పట్టించుకోని అంశాలే ఆ పార్టీకి నష్టం చేశాయన్న అభిప్రాయం కూడా ఉంది. ఇప్పుడు అదే విషయాలను ప్రస్తావిస్తూ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం రాజకీయాల్లో సాధారణమే అయినా, ప్రజలు అన్నింటినీ గమనిస్తూనే ఉంటారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన వంటి పార్టీలు నైతికత గురించి ఎక్కువగా మాట్లాడుతున్నాయి. అందుకే చిన్న తప్పు జరిగినా పెద్ద ప్రభావం పడుతోంది. అధికారంలో ఉన్నవారికి ప్రతి చర్య భూతద్దంలో కనిపిస్తుంది. అందువల్ల నాయకులు అడుగు తీసే ముందు అడుగు అత్యంత ఆలోచనతో వేయాల్సి ఉంటుంది. ఆరోపణలు వచ్చిన వెంటనే స్పష్టమైన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఆలస్యం చేస్తే పార్టీ క్రెడిబిలిటీ దెబ్బతింటుంది. అరవ శ్రీధర్ విషయంలో జనసేన నాయకత్వం అంతర్గత కమిటీ వేయడం, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచడం సరైన దిశలో వేస్తున్న అడుగుగా భావిస్తున్నారు. అయితే ఆరోపణలు నిజమని తేలితే కఠిన చర్యలు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నేటి డిజిటల్ యుగంలో ఏ తప్పూ దాగదు అన్న నిజాన్ని రాజకీయ పార్టీలన్నీ గుర్తిస్తేనే భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులను నివారించవచ్చు. ఈ నేపథ్యంలో ఆరవ శ్రీధర్ రాజకీయ భవిష్యత్తు ఏ మలుపు తిరుగుతుందో అన్న ఉత్కంఠత సర్వత్రా చర్చనీయాంసంగా మారింది.

==================

# టార్గెట్ 150 ప్రారంభించేసిన జగన్

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:



ఒకటిన్నర సంవత్సరం నేను పాదయాత్రతో ప్రజల మధ్యే ఉంటాను. 150 నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తాను. జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట ఉంటుందని జగన్ మోహన్ రెడ్డి అన్నారు. మాటమీద నిలబడే ప్రభుత్వం ఉండేది. మాట ఇస్తే దాన్ని నిలబెట్టుకోవాలన్న తపన, తాపత్రయం ఉండేది. చంద్రబాబు నాయుడు మళ్లీ అధికారంలోకి వచ్చాక ఉన్న పథకాలన్నీ రద్దైపోయాయని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అబద్ధాలుగా తేలిపోయాయి. సంక్రాంతిరోజు చూస్తే.. ప్రభుత్వమా..? జంగిల్‌రాజ్ అన్నట్లు అనిపించింది. చూడాలి. సోషల్ మీడియాలో వీడియోలు చూస్తే ఆశ్చర్యం వేస్తోంది. మొబైల్ రికార్డింగ్ డ్యాన్సులు నడిపారు. తాగరా.. తాగి చిందేయరా.. అన్న రీతిలో జరిగాయి. అటవిక రాజ్యంలో ఉన్నామా అనిపిస్తోందని జగన్ అగ్రహం వ్యక్తం చేశారు.కోడి పందాలు నడపడానికి వేలం పాటలు నిర్వహించారు. పులివెందులలోనూ కోడిపందాలకు వేలంపాటలు పెట్టారు. ప్రభుత్వమే దగ్గరుండి చేయిస్తోంది.. వచ్చిన సొమ్మును ఎమ్మెల్యేలు, చంద్రబాబు, లోకేశ్, పోలీసు అధికారులు పంచుకున్నారని జగన్ ఆరోపించారు.భీమవరం డీఎస్పీ మాటలు వింటే ఆశ్చర్యంవేసింది. డీఎస్పీ ఊపేయ్.. కుదిపేయ్.. అంటున్నాడు. మనం ఏ సమాజంలో ఉన్నామో అర్థంకావడం లేదు. రాష్ట్రం జంగిల్ రాజ్ అయ్యింది. బరితెగింపునకు అడ్డులేకుండా పోయింది. విచ్చలవిడిగా మనం ఊహించని స్థాయికి వెళ్లిపోయిందని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.రైల్వేకోడూరు ఎమ్మెల్యే ఒక ప్రభుత్వ ఉద్యోగి అయిన మహిళను బెదిరించి, భయపెట్టాడు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులు భరించలేక ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకుందిసత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మహిళను బలాత్కారం చేసి చివరకు అధికార దుర్వినియోగం కేసును క్లోజ్ చేయించుకున్నాడు. మంత్రి సంధ్యారాణి పీఏపై ఒక ప్రభుత్వ ఉద్యోగి అయిన మహిళ ఫిర్యాదు చేస్తే.. అరెస్టు చేయాల్సిందిపోయి, బాధిత మహిళను జైలుకు పంపారని జగన్ అన్నారు. మరో మంత్రి వాసంశెట్టి సుభాష్ రికార్డింగ్ డ్యాన్సులు వేశాడురాష్ట్రం జంగిల్ రాజ్ లా మారిపోయిందని జగన్ అన్నారు.పాదయాత్రపై జగన్ మాట్లాడుతూ.. ఒకటిన్నర సంవత్సరం నేను పాదయాత్రతో ప్రజల మధ్యే ఉంటాను. 150 నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తాను. జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట ఉంటుందని జగన్ మోహన్ రెడ్డి అన్నారు. గతంలో నేను కూడా పాలనమీద ఎక్కువ దృష్టి పెట్టాను. కార్యకర్తలకు చేయాల్సింది చేయలేకపోయి ఉండొచ్చు. ఇప్పుడు కార్యకర్తలకే పెద్దపీట ఉంటుంది. కార్యకర్తల ద్వారా ప్రజలకు మరింత మంచి జరిగేలా ఉంటుందని జగన్ అన్నారు.

# హోంగార్డు..

## 15 ఏళ్లు 20 కోట్ల ఆదాయం...

విజయనగరం, జనవరి 30, ఇప్పటివరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు చేసిన తనిఖీలలో ఉన్నత హోదాలలో పనిచేసిన ఉద్యోగులు మాత్రమే దొరికారు. వారు మాత్రమే ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారనే అభియోగాలు ఎదుర్కొన్నారు. కానీ చరిత్రలో తొలిసారిగా ఓ హోంగార్డ్ అదాయానికి మించి కాదు.. అంతకుమించి అనే స్థాయిలో ఆస్తులను సంపాదించాడు.

ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు రావడంతో సదరు హోంగార్డు మీద దృష్టి పెట్టారు. ఆ తర్వాత ఆయన బాగోతం కథలు కథలుగా బయటపడింది.అతడి పేరు శ్రీనివాసరావు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుగా పని చేస్తూ ఉంటాడు. అతడు గతంలో ఏసీబీ శాఖలో దాదాపు 15 సంవత్సరాలుగా పనిచేశాడు. అతను పని చేస్తున్న క్రమంలో ముందుగా దాడుల గురించి సమాచారాన్ని సంబంధిత అధికారులకు చేరవేసేవాడు. తద్వారా వారి దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసేవాడు. ఉన్నతాధికారుల అండతో.. వారికి రకరకాల సపర్యలు చేసి 15 సంవత్సరాల పాటు ఏసీబీలో ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకున్నాడు. 15 సంవత్సరాలు కాలంలో అతడు దాదాపుగా 20 కోట్ల వరకు ఆస్తులను కూడ పెట్టాడు.తన మీద ఏమాత్రం అనుమానం రాకుండా ఉండడానికి అత్యంత జాగ్రత్తగా వ్యవహరించేవాడు. డబ్బులు కూడా నేరుగా తీసుకునేవాడు కాదు. అయితే ఇటీవల కాలంలో అతని ఆస్తులు అంతకంతకు పెరగడం.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇతడి గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు రావడంతో శ్రీనివాసరావు మీద దృష్టి పెట్టారు. అతడి ఆస్తులు.. వాడుతున్న ఫోన్లు.. ఖరీదైన లైఫ్ స్టైల్ చూసి ఉన్నతాధికారులు ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత అన్ని వివరాలు సేకరించి గురువారం అతని ఇంట్లో సోదాలు మొదలుపెట్టారు.

ఏసీబీ అధికారులు విజయనగరం, గుర్ల, విశాఖపట్నంలో తనిఖీలు నిర్వహించారు. దాదాపు 20 కోట్ల ఆస్తులను గుర్తించారు. ఖరీదైన ఇళ్ల స్థలాలు.. గృహాలు.. బంగారం, నగదు, వ్యవసాయ భూములు అతడు సంపాదించినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. అయితే ఇతడు సంపాదించిన ఆస్తులు మొత్తం కుటుంబ సభ్యులు, బంధువుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాడు. అయితే ఇటీవల కాలంలో అతడు ఖరీదైన వాహనాలలో తిరగడం పోలీసు ఉన్నతాధికారుల కంటపడింది. ఆ తర్వాత అతని గురించి వరుసగా ఫిర్యాదులు రావడంతో లోతుగా దర్యాప్తు మొదలుపెట్టారు. అనంతరం అతడు సంపాదించిన సంపాదన.. చేస్తున్న లాబింగ్ వ్యవహారాలు మొత్తం పోలీసులకు తెలిసిపోయాయి. దీంతో ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేయడంతో శ్రీనివాసరావు బండారం మొత్తం బయటపడింది

# రాష్ట్రం లోని పలు జిల్లాల్లో అవినీతి నిరోధక శాఖ దాడులు

విజయవాడ భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

నెల్లూరు జిల్లా దగదర్తి తహసీల్దార్ పాలకృష్ణ ఇళ్లలో,అతని మిత్రులు, సన్నిహితుల ఇళ్లలో ఏసీబీ ఏక కాలంలో సోదాలు జరిపింది. పలు ఆస్తులు,నగదు గుర్తించింది. ఆదాయానికి మించి ఆస్తుల ఫిర్యాదులతో ఏపీలో ఏసీబీ వరుస దాడులు చేస్తోంది. గురువారం ఒకేసారి రెండు చోట్ల మెరుపు దాడులు చేసిన అధికారులు.. ఇవాళ నెల్లూరు జిల్లా దగదర్తి తహసీల్దార్ పాలకృష్ణ ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఏకకాలంలో 8 చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి. పాలకృష్ణ, అతని మిత్రులు, బంధువుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. సోదాల్లో నగదు, బంగారం, ఇతర ఆస్తులు గుర్తించినట్లు సమాచారం. న్యాయశాఖ ఉద్యోగులపై మరో ఫిర్యాదుతో ఐదు చోట్ల తనిఖీలు జరుగుతున్నాయి. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు...

# సుస్మితకు 75 కోట్ల లాభం

చెన్నై, జనవరి 30, ( భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

మెగాస్టార్ చిరంజీవి గురించి మనం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో తనకున్న రికార్డులు ఆయనను చాలా గొప్పగా పరిచయం చేస్తూ ఉంటాయి. 70 సంవత్సరాల వయసులో కూడా ప్రస్తుతం ఇండస్ట్రీలో ఉన్న యంగ్ హీరోలకు ఏమాత్రం తీసిపోకుండా సినిమాలను చేస్తున్న ఘనత తనకే దక్కుతుంది. అలాంటి చిరంజీవి రీసెంట్ గా 'మన శంకర్ వరప్రసాద్' సినిమాతో సూపర్ సక్సెస్ ని సాధించాడు. ఇక ఈ సినిమాకి తన కూతురు అయిన సుష్మిత ఒక ప్రొడ్యూసర్ గా కొనసాగిన విషయం మనకు తెలిసిందే. ఇక మరో ప్రొడ్యూసర్ గా సాహు గారపాటి వ్యవహరించారు. వీళ్ళిద్దరు కలిసి ఈ సినిమా కోసం 150 కోట్ల బడ్జెట్ ను కేటాయించారు. ఇందులో సుష్మిత కొణిదల 75 కోట్ల వరకు బడ్జెట్ పెట్టినట్టుగా తెలుస్తోంది.అయితే ఈ సినిమా ఇప్పుడు 400 కోట్ల మార్క్ ను టచ్ చేస్తున్న క్రమంలో దాదాపు 200 కోట్ల వరకు రిటర్న్ వచ్చే అవకాశాలైతే ఉన్నాయి.

అంటే తను పెట్టిన పెట్టుబడి 75 కోట్లు తీసేస్తే ఆమెకు దాదాపు 125 కోట్ల వరకు ప్రాఫిట్ అయితే వచ్చినట్టుగా తెలుస్తుంది. ఇక ఏది ఏమైనా కూడా చిరంజీవి తన కూతుర్ని స్టార్ ప్రొడ్యూసర్ గా మార్చాలనే ఉద్దేశ్యంతో తను చేస్తున్న ఈ కమర్షియల్ సినిమాకి ప్రొడ్యూసర్ గా వ్యవహరించమని చెప్పినట్టుగా తెలుస్తుంది.ఎలాగూ అనిల్ రావిపూడి చేసే సినిమా సక్సెస్ ని సాధిస్తుందని చిరంజీవికి తెలుసు?ఒకవేళ తేడా కొట్టిన కూడా ఈ సినిమా పెట్టిన బడ్జెట్ ను రికవరీ చేయగలదనే నమ్మకం చిరంజీవికి ఉంది. కాబట్టే సాహు గారపాటి గారితో కొలాబ్రేట్ చేసి మరి సుస్మిత ని ప్రొడ్యూసర్ గా పరిచయం చేశాడు.ఇక ఏది ఏమైనా కూడా ఈ సినిమా వల్ల సుష్మిత మంచి ప్రొడ్యూసర్ గా అవతరించిందే రాబోయే సినిమాలతో కూడా ఆమె సక్సెస్ ఫుల్ సినిమాలను చేయగలిగితే టాప్ ప్రొడ్యూసర్ గా మారుతుందని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు?

# జంపింగ్ జంపాంగ్ లు

కరీంనగర్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

ఎన్నికలు వచ్చాయంటే చాలు జంపింగ్ జపాంగ్ ఘటనలు పెరిగిపోతుంటాయి. పార్టీ తనకు సీటు ఇవ్వలేదని, మరో పార్టీ కండువా కప్పుకుంటారు. అక్కడ చేదు అనుభవం ఎదురైతే, మరో పార్టీలోకి లేక నేతల బుజ్జగింపులతో తిరిగి సొంతపార్టీలోకి తిరిగి వస్తుంటారు. తెలంగాణ పురపాలక ఎన్నికల సమయంలో జగిత్యాల జిల్లా కోరుట్లలో ఇలాంటి సీన్ రిపీట్ అయింది. కౌన్సిలర్ టికెట్ కోసం ఒక నాయకుడు ఉదయం ఒక పార్టీలో చేరి, రాత్రికి మరో పార్టీ గూటికి చేరుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

కోరుట్ల పట్టణంలోని 8వ వార్డు నుంచి పోటీ చేసేందుకు తోట గంగాధర్ అనే నాయకుడు కొద్ది రోజులుగా కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అదే వార్డు నుంచి పార్టీ తరఫున మరొకరు ప్రయత్నిస్తుండటం, తనకు టికెట్ హామీ రాకపోవడంతో ఉదయం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం ఉదయం బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, గంగాధర్ ఇంటికి స్వయంగా వెళ్లి ఆయనకు, ఆయన మద్దతుదారులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తోట గంగాధర్‌తో మాజీ కౌన్సిలర్ హమీద్, 20 మంది యువకులు గులాబీ కండువా కప్పుకున్నారు.ఈ విషయం కాంగ్రెస్ ముఖ్య నాయకులకు తెలియడంతో వారు వెంటనే అప్రమత్తమయ్యారు. రాత్రికి తోట గంగాధర్‌ను మెట్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసుకు పిలిపించి చర్చలు జరిపారు. చివరకు 8వ వార్డు అభ్యర్థిగా గంగాధర్‌ను ప్రకటిస్తూ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు ఆయనకు కండువా కప్పి తిరిగి పార్టీలోకి చేర్చుకున్నారు. సీటు కోసం జంపింగ్ జపాంగ్ అంటూ స్థానికులు అంటున్నారు.

# ఈటెల కేసీఆర్ కు దగ్గరవుతున్నారా




హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

తెలంగాణ రాజకీయాల్లో ఈటల రాజేందర్ ఒక ప్రత్యేకమైన శైలి కలిగిన నేత. ఉద్యమ కాలం నుండి కేసీఆర్ వెన్నంటి ఉండి, ఆ తర్వాత అత్యంత నాటకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) నుండి బయటకు వచ్చి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన తర్వాత కూడా ఆయన ప్రతి అడుగు ఆసక్తికరంగానే ఉంటోంది. తాజాగా నేరేడ్‌మెట్ అభివృద్ధి పనుల వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఈటల రాజేందర్ దాదాపు రెండు దశాబ్దాల పాటు కేసీఆర్ నాయకత్వంలో పనిచేశారు. రాజకీయాల్లో 'బాస్' అనే పదం ఒక నేత పట్ల ఉండే విధేయతకు గుర్తు. బీజేపీలో చేరిన తర్వాత కూడా కేసీఆర్‌ను 'బాస్' అని సంబోధించడం అనేది ఈటల మనసులో ఇంకా ఆ పాత జ్ఞాపకాలు ఉన్నాయని సూచిస్తోందా? లేదా బహిరంగ సభల్లో ప్రసంగించేటప్పుడు యాదృచ్ఛికంగా వచ్చిన మాటనా అనేది చర్చనీయం. అయితే, ఆయన మాట విన్న వెంటనే సభలో 'జై కేసీఆర్' నినాదాలు రావడం గమనార్హం. ఆయన మళ్లీ బీఆర్ఎస్ లోకి వెళ్తారా అనే ప్రచారమూ సాగుతోంది. మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ బలంగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గ పరిధిలోని మెజారిటీ స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంది. ఎంపీగా గెలిచిన ఈటల, ఇప్పుడు కేసీఆర్ పట్ల సానుకూల వ్యాఖ్యలు చేయడం ద్వారా బీఆర్ఎస్ క్యాడర్‌ను, ఓటర్లను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారా? అనే అనుమానాలు రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటంలో విపక్షాలన్నీ ఏకం కావాలనే సంకేతం కూడా ఇందులో ఉండవచ్చు. నాకు కులం, మతం లేదు.. ప్రజలే నా బలం" అని ఈటల పేర్కొనడం ద్వారా తాను ఏ పార్టీలో ఉన్నా తనకంటూ ఒక సొంత ఇమేజ్ ఉందని ఆయన చాటిచెప్పారు. తన తల్లిదండ్రుల వారసత్వంతో కాకుండా సొంతంగా ఎదిగానని చెప్పడం ద్వారా అటు కేసీఆర్ కుటుంబ పాలనను, ఇటు వారసత్వ రాజకీయాలను ఆయన పరోక్షంగా విమర్శిస్తూనే, మరోవైపు కేసీఆర్ మార్కు రాజకీయాలను గౌరవిస్తున్నట్లు కనిపిస్తోంది. రాజకీయ వ్యాఖ్యలు పక్కన పెడితే, నేరేడ్‌మెట్ ఆర్‌యూబీ (ఖీఙః), ఎల్‌హెచ్ఎస్ (ఒఊూ) పనుల కోసం రూ. 80 కోట్లు మంజూరు చేయించడం ఈటల పనితీరుకు నిదర్శనం. ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్న మల్కాజిగిరి ప్రజలకు ఇది పెద్ద ఉపశమనం. కేంద్రం నుండి నిధులు రాబట్టడంలో తాను సఫలమయ్యానని నిరూపించుకోవడం ద్వారా తన పదవికి న్యాయం చేస్తున్నానని ఆయన చాటుకున్నారు. ఈటల రాజేందర్ వ్యాఖ్యలు బీజేపీలో కలకలం రేపవచ్చు, కానీ క్షేత్రస్థాయిలో ఆయన తన పట్టును నిలుపుకోవడానికి అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. "బాస్" వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# పొత్తుల లెక్కలు తేలెదెలా...

ఖమ్మం భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోగా, ముఖ్యంగా అధికార కాంగ్రెస్, వామపక్షాల మధ్య పొత్తుల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితులకు, ఇప్పటికి సమీకరణాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ, తన మిత్రపక్షాలైన వామపక్షాలను కలుపుకుపోవడంలో ఎదుర్కొంటున్న సవాళ్లు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం పొత్తుల చర్చల్లో కొత్తగూడెం మున్సిపాలిటీ అత్యంత కీలకంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గట్టి పట్టున్న సిపిఐ కొత్తగూడెంలో తమ బలాన్ని నిరూపించుకోవాలని చూస్తోంది. మొత్తం 60 డివిజన్లలో తమకు కనీసం 30 స్థానాలు కేటాయించాలని ఆ పార్టీ పట్టుబడుతోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి 17 స్థానాలకు మించి ఇవ్వలేమని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. ఈ 13 స్థానాల తేడా ఇప్పుడు రెండు పార్టీల మధ్య చిచ్చు పెట్టింది. ఒకవేళ కాంగ్రెస్ తన పట్టు సడలించకపోతే, ఒంటరిగా బరిలోకి దిగడమే కాకుండా, తెలుగుదేశం వంటి ఇతర పార్టీలతో కలిసి వెళ్లేందుకు కూడా సిపిఐ సిద్ధమవుతోంది. ఇదే గనుక జరిగితే ఖమ్మం, నల్గొండ, వరంగల్ వంటి జిల్లాల్లో కాంగ్రెస్ ఓట్లకు గండి పడే ప్రమాదం ఉందనేది విశ్లేషకుల అభిప్రాయం. మరోవైపు సిపిఎం తీరు ఆసక్తికరంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్న ఈ పార్టీ, మున్సిపల్ ఎన్నికల్లో కొత్త మిత్రులను వెతుక్కునే పనిలో ఉంది. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల సమయంలో కొన్ని చోట్ల బిఆర్ఎస్, సిపిఎం నేతల మధ్య అవగాహన కుదిరినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే ఫార్ములాను అమలు చేసే యోచనలో రెండు పార్టీలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండాలంటే కాంగ్రెసేతర పార్టీలన్నీ ఏకం కావాలనేది సిపిఎం అంతర్గత వ్యూహంగా కనిపిస్తోంది. ఈ ఎన్నికల ప్రత్యేకత ఏమిటంటే, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన పొత్తు ఉండకపోవచ్చు. స్థానిక బలాబలాలు, నాయకుల మధ్య ఉన్న సాన్నిహిత్యం ఆధారంగా పొత్తులు మారే అవకాశం ఉంది. కొన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం కలిసి పోటీ చేసే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల కాంగ్రెస్‌ను కాదని, రెండు కమ్యూనిస్టు పార్టీలు జతకట్టవచ్చు. నల్గొండ, ఖమ్మం వంటి జిల్లాల్లోని కొన్ని పట్టణాల్లో బిఆర్ఎస్, సిపిఎం మధ్య లోపాయికారీ ఒప్పందాలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. వామపక్షాలు విడివిడిగా పోటీ చేస్తే అది పరోక్షంగా అధికార కాంగ్రెస్‌కు చేటు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో కమ్యూనిస్టులకు కేడర్ ఓటు బ్యాంక్ బలంగా ఉంది. పొత్తులు కుదరకపోతే ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు, మిత్రపక్షాల ఓట్లు కూడా చీలిపోయి ప్రతిపక్ష బిఆర్ఎస్ లేదా బిజెపికి లాభం చేకూరే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ పార్టీకి ఇది కేవలం మున్సిపల్ ఎన్నిక మాత్రమే కాదు, ప్రభుత్వ పనితీరుపై ప్రజల తీర్పుగా మారుతుంది. అందుకే చిన్న పార్టీలను కూడా కలుపుకుపోవాల్సిన అవసరం ఆ పార్టీకి ఉంది. కానీ, సీట్ల సర్దుబాటులో ఇచ్చిపుచ్చుకునే ధోరణి లేకపోతే పొత్తులు పొడవటం కష్టమే. మొత్తానికి తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు పొత్తుల గందరగోళం మధ్యే మొదలయ్యాయి. కొత్తగూడెం పీటముడి వీడితేనే కాంగ్రెస్-సిపిఐ బంధంపై స్పష్టత వస్తుంది. సిపిఎం ఏ అడుగు వేస్తుందనేది బిఆర్ఎస్ వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది. రానున్న రెండు మూడు రోజుల్లో అభ్యర్థుల ఖరారు, బి-ఫామ్ ల పంపిణీ నాటికి ఈ రాజకీయ గందరగోళానికి ఒక తెర పడే అవకాశం ఉంది.

# ఏఐపై మోడీ మేధోమథనం

న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని శాసిస్తున్న తరుణంలో భారత్ ఈ రంగంలో అగ్రగామిగా ఎదగడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక అడుగులు వేస్తున్నారు. లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో దేశంలోని దిగ్గజ టెక్ కంపెనీల సీఈవోలు, ఏఐ నిపుణులతో ప్రధాని ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరిలో జరగనున్న ఇండియా-ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ నేపథ్యంలో ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. భారతదేశం యూపీఐ ద్వారా ప్రపంచానికి తన సాంకేతిక నైపుణ్యాన్ని ఇప్పటికే నిరూపించుకుందని.. ఇప్పుడు ఏఐ రంగంలో కూడా అలాంటి విజయాలు సాధించాలని ప్రధాని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో స్వదేశీ ఎఐ సాంకేతికతను ప్రోత్సహించాలని, టెక్నాలజీలో స్వావలంబన సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. భారత్ వద్ద ఉన్న డేటా వైవిధ్యం, ప్రజాస్వామ్య విలువలు ప్రపంచ దేశాలకు మనపై నమ్మకాన్ని కలిగిస్తాయని, అందుకే భారత్‌ను గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చాలనివిజ్ఞప్తి చేశారు. ఎఐ అభివృద్ధిలో కేవలం వేగం మాత్రమే కాదు.. భద్రత, పారదర్శకత కూడా ముఖ్యమని మోదీ స్పష్టం చేశారు. ఎఐ దుర్వినియోగం కాకుండా దాని వినియోగం పారదర్శకంగా, న్యాయంగా ఉండేలా పటిష్టమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించాలని సూచించారు. యువతలో ఎఐనైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని నిపుణులను కోరారు. ఈ సమావేశంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , విప్రో, హెచ్ సీఎల టెక్, జోహో కార్పొరేషన్, జియో ప్లాట్‌ఫామ్స్, అదానీ కనెక్స్ వంటి దిగ్గజ కంపెనీల లతో పాటు.. ఐఐటీ మద్రాస్, ఐఐటీ బాంబే, ఐఐటీ హైదరాబాద్ నిపుణులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, రాజీవ్ చంద్రశేఖర్ కూడా ఈ చర్చల్లో భాగస్వాములై, ప్రభుత్వ మద్దతును వారికి వివరించారు.

## తిరుమల కొండపై ఫొటో షూట్.. క్షమాపణలు కోరిన జంట

తిరుపతి , జనవరి 30, తిరుమల శ్రీవారి ఆలయం ముందు రీల్స్ చేసిన నూతన వధూవరులు, తమిళనాడులోని తిరువన్నమలైకి చెందిన తిరుమల్, గాయత్రి దంపతులు తమ చర్యలకు క్షమాపణలు కోరుతూ వీడియో విడుదల చేశారు. శ్రీవారి సేవ చేసి తమ తప్పును సరిదిద్దుకుంటామని వారు తెలిపారు. ఈ సంఘటన భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని విమర్శలు వెల్లువెత్తాయి

## కల్వర్టును ఢీకొని దూసుకెళ్లిన వ్యాన్.. పదహారు మందికి గాయాలు

కృష్ణా , జనవరి 30, బంటుమిల్లి మండలం పెందుర్తి వద్ద శుక్రవారం ఉదయం అంతర్వేది తీర్థానికి వెళ్లి వస్తుండగా ఒక మినీవ్యాన్ కల్వర్టును ఢీకొని బోదెలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నాగాయలంక మండలం సొర్లగొందికి చెందిన 16 మంది గ్రామస్థులు గాయపడ్డారు. వీరిలో కొందరికి తీవ్ర గాయాలు కావడంతో క్షతగాత్రులను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## లారీ బోల్తా మహిళ, డ్రైవర్ కు గాయాలు

ఖమ్మం , జనవరి 30, ఖమ్మం జిల్లా వైరా మండలం జింకలగూడెం గ్రామంలో శుభాబుల్ కర్ర లోడుతో మందికి వస్తున్న లారీ అదుపుతప్పి పల్టీ కొట్టడంతో కిరాణం బడ్డీ పై సుబాబుల్ కర్రలు పడిపోవడంతో మహిళకు లారీ డ్రైవర్ కీ గాయాలయ్యాయి బోనకల్లు వైపు నుంచి వైరా వైపు వస్తున్న సుబాబుల్ కర్ర లారీ జింకల గూడెం గ్రామంలో సుబాబుల్ కర్ర లారీ అదుపుతప్పి పక్కనే ఉన్న కిరాణం బడ్డీ పై పడిపోయింది

# కాంగ్రెస్ సెల్ఫ్ గోల్...

హైదరాబాద్, జనవరి 30,

మున్సిపల్ ఎన్నికల వేళ సిట్ అధికారులు బీఆర్ఎస్ కు సానుభూతి తెచ్చేందుకు నడుంకట్టుకున్నట్లు కనిపిస్తుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు నోటీసులు ఇచ్చివిచారణకు పిలవడం మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపుతుందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. కాంగ్రెస్ శ్రేణులు ఇదే భయపడుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు చోటు చేసుకున్న కీలక పరిణామం మున్సిపల్ ఎన్నికల్లో కారు పార్టీకి కలసి వచ్చేటట్లు కనిపిస్తుంది. అరవై ఐదేళ్ల వయసులో పెద్దాయనను విచారణ పేరుతో నోటీసులు ఇవ్వడం పై కాంగ్రెస్ నేతలే లోలోపల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో చేయాల్సిన పని ఇదా? అంటూ కొందరయితే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. ఎంత లేదన్నా కేసీఆర్ తెలంగాణ సాధించిన వ్యక్తిగా నేటికీ ప్రజల్లో చెరగని ముద్ర ఉంది. ఆయన అవినీతి, ఆరోపణలు గత రెండేళ్ల నుంచి ఏ మాత్రం నిరూపించలేక కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ ఏంటన్న ప్రశ్న ప్రజల నుంచి ఎదురవుతుందంటున్నారు. కాళేశ్వరంలో కోట్ల రూపాయలు అవినీతిజరిగిందని ఆరోపణలు చేసి.. కొన్ని నెలల పాటు కమిషన్ తో కాలం గడిపి, తర్వాత నింపాదిగా సీబీఐకి ఇస్తున్నట్లు చెప్పేయడంతోనే అందులో డొల్లతనం బయటపడిందన్న కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. కాళేశ్వరం అవినీతిని తేల్చలేని వాళ్లు ఇక ఫోన్ ట్యాపింగ్ కేసులో సాధించిందేమటన్న ప్రశ్నను బీజేపీ నేతలు కూడా ప్రశ్నిస్తున్నారు. ఒకరకంగా పెద్దాయనను ఇలా విచారణ పేరిట వేధించడం వల్ల కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టమే కాని, ఎటువంటి ప్రయోజనాలు ఉండవన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. రేపు ఆయన ఇంట్లో విచారణ చేసినా బీఆర్ఎస్ నేతలు చేసే హడావిడితో కొంత సానుభూతి ఆ పార్టీకి వస్తుందని, మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇది అవసరమా? అన్న ప్రశ్న కూడా కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నేతల నుంచి వినిపిస్తుంది. బీజేపీ నేతలు చెబుతున్నట్లు ఇందులో సిట్ అధికారుల కానీ, ప్రభుత్వం కానీ సాధించిందేమీ ఉండదని, కాలయాపన కోసమే ఇటువంటి నోటీసులు ఇవ్వడం, పార్టీకి నష్టంకొని తెచ్చుకోవడం ఎందుకని ప్రశనిస్తున్నారు. మొత్తం మీద కేసీఆర్ ను రేపు విచారించినా తేలేది ఏముంటుందో తెలియదు కానీ.. మున్సిపల్ ఎన్నికల్లో దెబ్బ తగలడం ఖాయమన్న వ్యాఖ్యలు గాంధీ భవన్ నుంచే వినిపిస్తుండటం విశేషం.

# కమలం గేర్ మార్పు..

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

తెలంగాణ రాజకీయ యవనికపై ప్రత్యామ్నాయం మేమే అని విర్రవీగిన భారతీయ జనతా పార్టీకి, గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలు ఒక గట్టి హెచ్చరికను పంపాయి. ఒకప్పుడు రాష్ట్రంలో నెంబర్ 2 స్థానానికి ఎదిగామని, ఇక అధికారమే తరువాయి అని సంబరపడ్డ కమలదళానికి.. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి ఇంకా అట్టడుగునే ఉందన్న చేదు



నిజం బోధపడింది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు జరగబోతున్న మున్సిపల్ ఎన్నికలను బీజేపీ తన ఉనికి చాటుకునేందుకు, పోగొట్టుకున్న ప్రతిష్టను తిరిగి పొందేందుకు ఒక అగ్నిపరీక్షగా భావిస్తోంది. ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం బీజేపీ అధిష్టానం ఈసారి వ్యూహాన్ని మార్చింది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర నాయకత్వానికి వదిలేసే కేంద్ర పెద్దలు, ఈసారి నేరుగా రంగంలోకి దిగుతున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తన కొత్త టీమ్‌తో ఇప్పటికే కసరత్తు ప్రారంభించగా, చాణక్యుడిగా పేరుగాంచిన అమిత్ షా స్వయంగా ప్రచార పర్వంలో పాల్గొంటుండడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో మహబూబ్ నగర్ లేదా ఫిబ్రవరి 8, 9 తేదీల్లో నిర్మల్ పట్టణాల్లో వీళ్ల భారీ బహిరంగ సభలకు ఏర్పాట్లు జరుగుతుండటం.. బీజేపీ ఈ ఎన్నికలను ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థం చేస్తోంది. మున్సిపాలిటీలపై జెండా ఎగురవేస్తే తప్ప, వచ్చే సాధారణ ఎన్నికల్లో గెలుపు సాధ్యం కాదని ఢిల్లీ పెద్దలు డిసైడ్ అయ్యారు. బీజేపీ వెనుకబాటుకు ప్రధాన కారణం బయటి శత్రువుల కంటే ఇంట్లోని విభేదాలే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీలో పాత నాయకులకు, కొత్తగా చేరిన వలస నాయకులకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లా స్థాయిలో గ్రూపు రాజకీయాలు పార్టీ కేడర్‌ను అయోమయానికి గురిచేస్తున్నాయి. ఉమ్మడి నల్గొండ వంటి జిల్లాల్లో ఇటీవల జరిగిన దాడులు, గొడవలే ఇందుకు నిదర్శనం. అధిష్టానం ఎన్ని ఆదేశాలిచ్చినా, రాష్ట్ర నేతల మధ్య సఖ్యత లేకపోవడంతో క్షేత్రస్థాయి కార్యకర్తలు నిరాశలో ఉన్నారు. ఈ చలనం లేని కేడర్‌లో జోష్ నింపేందుకే అమిత్ షా వంటి అగ్రనేతలను బరిలోకి దించుతున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన సీట్లు రాకపోవడం, పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగినా అది విజయతీరాలకు చేర్చకపోవడంతో పార్టీ మేధోమథనంలో పడింది. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఈసారి 'అర్బన్ ఓటర్ల'పైనే ఆశలు పెట్టుకుంది. కేంద్ర పథకాల లబ్ధిదారులు, మధ్యతరగతి ప్రజలే తమను గట్టెక్కిస్తారని నమ్ముతోంది. నితిన్ నబీన్ నాయకత్వంలో మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్ వంటి నేతలను ఇన్‌ఛార్జులుగా నియమించడం ద్వారా ఇతర రాష్ట్రాల ఎన్నికల వ్యూహాలను ఇక్కడ అమలు చేయబోతున్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ తిరిగి పుంజుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల మధ్య బీజేపీ తన స్థానాన్ని ఎలా కాపాడుకుంటుందనేది ప్రశ్నార్థకం. కేవలం అగ్రనేతల పర్యటనలతోనే ఓట్లు రాలతాయా? లేక గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి నాయకత్వం ఐక్యంగా ముందుకు సాగుతుందా? అనేది వేచి చూడాలి. బీజేపీకి ఈ మున్సిపల్ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కాదు.. తెలంగాణలో ఆ పార్టీ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే కీలక మలుపు. అమిత్ షా రాకతో పార్టీలో జోష్ రావచ్చు కానీ, ఆ జోష్ ఓట్ల రూపంలోకి మారాలంటే స్థానిక నేతలు అహంభావాన్ని వీడి ఐక్యంగా పనిచేయాల్సి ఉంటుంది. లేదంటే నెంబర్ 2 కల కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# బీసీలకు మొండి చేయి...?

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

సుదీర్ఘ కాలంగా బీసీలు తమ జనాభా ప్రకారం వారికి రిజర్వేషన్ అమలు కావాలని ఎదురుచూస్తున్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో బీసీల హక్కు సాకారం చేసుకునేందుకు ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీతో బీసీ వర్గాల్లో ఆశలు చిగురించాయి. రాష్ట్ర జనాభాలో పెద్ద వాటా ఉన్న బీసీ వర్గాలకు రాజకీయంగా, పరి పాలనాపరంగా తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని అధికార పక్షం హామీ ఇచ్చింది.కానీ ఆ హామీ చట్టబద్ధ హక్కుగా మారకుండానే స్థానిక ఎన్నికల నిర్వహణ కొనసాగుతుండటం తీవ్ర చర్చకు దారితీస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసి, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు జరుగనుండగా.. రిజర్వేషన్ల విషయంలో అదే వైఖరి కనిపించడంతో బీసీల హృదయాలను కలచివేస్తున్నది. ఎన్నికల వేళ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంటూ ఆశలు రేపిన ప్రభుత్వం ఈ డిమాండ్‌ను అమలుచేసే దశలో స్పష్టత చూపించలేకపోతోందని బీసీలు ఆగ్రహిస్తున్నారు. బీసీ రిజర్వేషన్ విషయంలో ప్రతిపక్షాలు సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని బీసీ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీ కేవలం గాలిమాటేనా అని బీసీలు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తామని ఘనంగా ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు..అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని చట్టబద్ధంగా అమలు చేయడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు బీసీల నుంచి వెల్లువెత్తుతున్నాయి. రాజ్యాంగ సవరణలు, జనాభా లెక్కలు, న్యాయపరమైన అడ్డంకుల పేరుతో నిర్ణయాలు వాయిదా పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అనేది సాధారణమైన హామీ కాదు. బీసీల సామాజిక న్యాయానికి అది నిదర్శనం. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన పాలక పక్షం, ఆ హామీని చట్టంగా మార్చకుండానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. కోర్టు ఆదేశాలు, జనగణన పేరుతో కాలయాపన జరిగింది. చివరకు పార్టీపరంగా టికెట్లు ఇచ్చి బీసీలకు న్యాయం చేసినట్టుగా ప్రచారం చేసింది. కానీ ఈ పరిస్థితి బీసీ వర్గాల్లో అనేక ప్రశ్నలకు దారితీసింది. నిజంగా బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలన్న రాజకీయ సంకల్పం ఉందా?, లేక ఎన్నికల ఒత్తిడిలో తాత్కాలిక పరిష్కారంతో సరిపెట్టుకున్నారా? అని అనుమానాలు వ్యక్తమయ్యాయి.పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు కొన్ని స్థానాలు దక్కినప్పటికీ అవి రిజర్వేషన్ వల్ల వచ్చిన హక్కులా?, లేక పార్టీ టికెట్ల పంపిణీలో భాగమా? అన్నది ఇప్పటికీ వివాదాస్పదంగానే ఉంది. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ అమలు కాకుండానే పంచాయతీ ఎన్నికలు జరగడం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. పార్టీల అంతర్గత కేటాయింపుల పేరుతో కొంతమంది బీసీలకు అవకాశాలు ఇచ్చినా.. అది భరోసా కల్పించే రిజర్వేషన్ కాదని బీసీ నేతలు అంటున్నారు.పంచాయతీ ఎన్నికలతో బీసీ రిజర్వేషన్ అంశంపై ఆయా వర్గాల్లో పాలక, ప్రతిపక్షాల వైఖరిపై స్పష్టత వచ్చింది. రాజ్యాంగం, జనాభా లెక్కలు, న్యాయపరమైన చిక్కులు అంటూ కారణాలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారన్న విమర్శలు బీసీ వర్గాల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలిస్తున్నాయి. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ ఇవ్వకుండానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శకులు అంటున్నారు.రిజర్వేషన్ అవసరమని నినాదాలు చేసి.. అమలు చేయాల్సిన సమయంలో మాత్రం చేతులెత్తేస్తారని తీవ్రంగా విమర్శిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు లభించిన సీట్లు పార్టీ దయతో వచ్చిన అవకాశాలుగానే మిగిలాయని, దీంతో సరైన రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదన్న అభిప్రాయం బలపడుతోంది. చట్టం ఉంటేనే ప్రతి బీసీకి సమాన అవకాశం లభిస్తుందని, లేకపోతే ఇది కేవలం ఎన్నికల హామీగా మిగిలిపోతుందని బీసీలు విమర్శిస్తున్నారు. 42 శాతం రిజర్వేషన్ హామీ అమలవుతుందా? లేక మళ్లీ ఎన్నికల దాకా నినాదాలకే పరిమితమవుతుందా? అన్న ప్రశ్న బీసీ సమాజాన్ని వేధిస్తోంది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీసీలకు రిజర్వేషన్ అమలుచేయడంలో అన్యాయం జరిగిందని స్పష్టమవు తుంది. ఇప్పటివరకు ఓర్పుతో ఎదురుచూసిన బీసీ సంఘాలు, మేధావులు, యువత ఇప్పుడు చట్టబద్ధ రిజర్వేషన్ తప్ప మరే ప్రత్యామ్నాయం లేదని అభిప్రాయపడుతున్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలయ్యే వరకు బీసీల రాజకీయ పోరాటం ముగియదన్న సంకేతాలు ఇస్తున్నారు.హామీలతో కాదు, చట్టంతోనే న్యాయం కావాలన్న డిమాండ్ మరింత బలపడుతోంది. పాలక, ప్రతిపక్షాలపై బీసీ వర్గాల్లో నెలకొన్న అసంతృప్తి ఉద్యమంగా మారుతుందా.. లేక ఎన్నికల్లో రాజకీయ తీర్పుగా బయటపడుతుందా అని ప్రభుత్వంలోనూ ఆందోళన కలిగిస్తున్నది. 42 శాతం రిజర్వేషన్ కేవలం నినాదం కాదని, బీసీల రాజకీయ భవిష్యత్‌కు కీలక మలుపు అని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఈ అంశంలో ఇంకా జాప్యం జరిగితే భవిష్యత్ ఎన్నికల్లో బీసీల తీర్పు రాజకీయ చరిత్రను మార్చే అవకాశముందని విశ్లేషకులు అంటున్నారు.తాజాగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలటీలకు ఎన్నిలక నోటిఫికేషన్ విడుదల అయింది. నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. కానీ ఇప్పటికీ బీసీల 42 శాతం రిజర్వేషన్‌పై చట్టపరమైన స్పష్టత లేదు. పంచాయతీ ఎన్నికల్లో చేసినట్లే మళ్లీ పార్టీపరమైన సర్దుబాట్లతో బీసీలకు న్యాయం చేసినట్టు చూపించాలని ప్రభుత్వం ప్రయత్ని స్తున్నదని బీసీలు ఆరోపిస్తున్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో పాలక, ప్రతిపక్షాలు ద్వంద్వ వైఖరిని అవలంభిస్తున్నాయని విమర్శిస్తున్నారు.ఒకవైపు బీసీలే సామాజిక వెన్నెముక అంటూనే మరోవైపు వారి రాజకీయ హక్కులను చట్టంగా మార్చడంలో వెనుకడుగు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయంగా బీసీల మద్దతు పొందుతూనే వారికి హక్కులు కల్పించేందుకు భయపడుతున్నారని విమర్శిస్తున్నారు. ఈ వైఖరే పాలక, ప్రతిపక్షాలపై ఉన్న నమ్మకాన్ని చెరిపేస్తోందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బీసీ రిజర్వేషన్ అమలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే చట్టపరమైన మార్గాలు కనుగొనడం అసాధ్యం కాదని వాదిస్తున్నాయి.ఇతర రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్ అమలు సాధ్యమైనప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కావడం లేదన్న ప్రశ్న బలంగా వినిపిస్తోంది. పంచాయతీ ఎన్నికల మాదిరిగానే మున్సిపల్ ఎన్నికల్లోనూ బీసీలకు తీవ్ర నిరాశే ఎదురైందని ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరి మరోసారి బీసీలకు చేస్తున్న ద్రోహమేనని మండిపడుతున్నాయి. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తూ, అధికారంలోకి వచ్చాక హామీలను పక్కన పెడుతున్నారన్న విమర్శలు రాజకీయంగా వేడెక్కుతున్నాయి.

# రోడ్ మ్యాప్ రెడీ చేస్తున్న కవిత

హైదరాబాద భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:



తెలంగాణలో మరో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూతురు కవిత కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. శాసనమండలిలో ప్రసంగించిన కవిత..ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నా..శక్తిగా తిరిగి చట్టసభల్లో అడుగు పెడతానంటూ శపథం చేసి వెళ్లారు. అసెంబ్లీ ముందున్న గన్ పార్క్‌లో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి.. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తానని ఆమె ప్రకటించారు.మరోవైపు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీ ద్వారానే పోటీ చేస్తామని కవిత చెబుతూ వస్తున్నారు. తాను పెట్టబోయే పార్టీలో యువతకు, మహిళలకు పెద్దపీట వేస్తానని కవిత ప్రకటించారు. రాజకీయ పార్టీ ఏర్పాటు ఆలస్యం అవుతుండటంతో..ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు కవిత.బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమం పేరుతో జిల్లాల పర్యటన చేస్తున్నారమె. మాజీ సీఎం జయలలితను గుర్తు చేసేలా..ఏకంగా కట్టు, బొట్టు అంతా లుక్‌నే మార్చేసి..జిల్లాల టూర్ చేస్తున్నారు. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ టార్గెట్ చేస్తూ కవిత ముందుకెళ్తున్నారు.ఇక ఇప్పుడు సొంత రాజకీయ పార్టీపై కవిత కసరత్తును వేగవంతం చేశారు. మెజార్టీ నేతలు తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చాలని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. మరికొందరు కొత్తగా ఏర్పాటు చేయబోయే పార్టీలో టీఆర్ఎస్ వచ్చేలా చూడాలని కవితను కోరినట్టు సమాచారం. కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిన నేపథ్యంలో..పాత టీఆర్ఎస్‌ను కొత్త పార్టీలో ఉండేలా చూడాలని సూచించారట. అందరి అభిప్రాయాలు తీసుకున్న కవిత..మార్చిలోనే కొత్త రాజకీయపార్టీని ప్రకటించనున్నట్లు జాగృతి వర్గాల టాక్.ఇప్పటికే జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో మెజార్టీ జిల్లాలను చుట్టేసిన కవిత.. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని భావిస్తున్నారట. ఈ క్రమంలోనే ఫిబ్రవరి నెలాఖరులో మంచిర్యాలలో పెద్దఎత్తున జనం బాట ముగింపు సభను నిర్వహించాలని కవిత నిర్ణయించారు.మంచిర్యాల సభలో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించాలా, లేదంటే హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం దగ్గర ప్రకటించాలా అన్నదానిపై ఇంకా ఓ డెసిషన్‌కు రాలేదంటున్నారు. మార్చిలో రాజకీయ పార్టీ ప్రకటించిన వెంటనే తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేయాలని కవిత భావిస్తున్నారట. పాదయాత్రపై ఇప్పటికే కుటుంబ సభ్యులు, జాగృతి ముఖ్యనేతలతో చర్చించారట.పాదయాత్ర రూట్ మ్యాప్‌ను కూడా సిద్ధం చేసుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది. తెలంగాణలోని అన్ని జిల్లాలు కవర్ అయ్యేలా మెజార్టీ అసెంబ్లీ స్థానాలను చుట్టివచ్చేలా పాదయాత్ర రోడ్ మ్యాప్‌ను రెడీ చేస్తున్నారట కవిత. దీంతో కవిత రాజకీయ పార్టీపై పొలిటికల్ సర్కిల్స్‌లోనే కాదు సామాన్య జనంలోనూ సర్వత్రా ఆసక్తి నెలకొంది

# తెలంగాణలో వ్యవసాయం భేష్...

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో తెలంగాణ వ్యవసాయ రంగం సాధించిన ప్రగతి ప్రత్యేక గుర్తింపు పొందింది. 2014 నుంచి 2023 మధ్యలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు భూమి విస్తీర్ణం.. ప్రస్తుతం 2.21 కోట్ల ఎకరాలకు చేరుకోవడం గమనార్హం. కేవలం తొమ్మిదేళ్లలోనే దాదాపు కోటి ఎకరాల అదనపు భూమి సాగులోకి రావడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భారీ నీటి పారుదల ప్రాజెక్టులు ప్రధాన కారణంగా నిలిచాయి. ముఖ్యంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం మరియు మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు భూగర్భ జలమట్టాన్ని పెంచి, బీడు భూములను సైతం పచ్చని పొలాలుగా మార్చాయి.పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా ఆర్థిక సర్వే నివేదికలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగానికి సంబంధించి ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. గత తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం ఊహించని రీతిలో పెరగడం విశేషం. సాగు విస్తీర్ణం పెరగడమే కాకుండా.. రాష్ట్ర జీడీపీలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తున్నట్లు సర్వే స్పష్టం చేసింది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో అంటే.. 2014 నుంచి 2023 మధ్య వరకు రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం కేవలం 1.31 కోట్ల ఎకరాలుగా ఉండేది. ప్రస్తుతం ఏకంగా 2.21 కోట్ల ఎకరాలకు చేరుకుందని సర్వేలో పేర్కొన్నారు. అంటే దాదాపు ఒక కోటి ఎకరాల అదనపు భూమి కొత్తగా సాగులోకి వచ్చింది. ఇది దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేని విధంగా నమోదైన అతిపెద్ద వృద్ధిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. సాగు విస్తీర్ణం ఇంతలా పెరగడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బహుళార్ధసాధక ప్రాజెక్టులు, జలవనరుల నిర్వహణ ప్రధాన కారణాలుగా ఆర్థిక సర్వే పేర్కొంది.అందులో ఒకటి మిషన్ కాకతీయ.. గ్రామాల్లోని చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలమట్టం భారీగా పెరిగింది.

దీనివల్ల బావులు, బోర్ల కింద సాగు పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు .. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా పేరుగాంచిన కాళేశ్వరం ద్వారా గతంలో ఎడారిగా ఉన్న ప్రాంతాలకు కూడా సాగునీరు అందింది. వీటితో పాటు.. చెక్ డ్యామ్‌ల నిర్మాణం , కాలువల ఆధునీకరణ ద్వారా చిట్టచివరి భూములకు కూడా నీరు చేరుతోంది. వీటి ఫలితమే.. సాగు భూమి విస్తీర్ణం అధికంగా పెరిగింది. ఇటీవల ప్రవేశపెట్టిన భూ భారతి ద్వారా.. భూ రికార్డుల ప్రక్షాళన, రెవెన్యూ , రిజిస్ట్రేషన్ విభాగాల ఏకీకరణ వల్ల భూ యజమానులకు స్పష్టత వచ్చింది. ఇది రైతులు తమ భూములను మరింత సమర్థవంతంగా సాగు చేసుకునేలా ప్రోత్సహించింది.వ్యవసాయంతో పాటు తయారీ రంగంలో తెలంగాణ 5 శాతం వాటాను నమోదు చేసింది. ఇక ఐటీ, ఫైనాన్స్ సర్వీసులలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులతో కలిసి తెలంగాణ దేశంలో 40 శాతం వాటాను కలిగి ఉంది. ఏఐ స్టార్టప్‌లలో తెలంగాణ 7 శాతం వాటాతో దూసుకుపోతోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 201.1 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. మున్సిపల్ బాండ్ల జారీలో కూడా హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. సాగు విస్తీర్ణం పెరుగుదల కేవలం ఆహార భద్రతనే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేస్తోందని నివేదిక పేర్కొంది.

# మున్సిపల్స్..ఎవరి లెక్కలు వారివి

కరీంనగర్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రభుత్వ పాలనకు రిఫరెండంగానే చూడాలి. ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో మున్సిపాలిటీలు, నగరాల్లో కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతుండటంతో అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్నాయి. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయింది. అయితే ఎవరికి వారే గెలుపు పై ధీమాగా ఉన్నారు. పంచాయతీ ఎన్నికల తరహా మాత్రం కాదు. ఎందుకంటే పార్టీ సింబల్ మీద జరిగే ఎన్నికలు కావడంతో ఖచ్చితంగా పరిపాలన పై ప్రజా తీర్పు ఎలా ఉందన్నది స్పష్టంగా తెలుస్తుంది. పంచాయతీ ఎన్నికల్లో గుర్తులుండవు కాబట్టి..ఎవరు గెలిచినా తమ వారిగా వారు చెప్పుకుంటారు.అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ మున్సిపల్ ఎన్నికలపై భారీ ఆశలు పెట్టుకుంది. పట్టణాల్లో పేదలతో పాటు తాము గత రెండేళ్ల నుంచి చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి తమను గట్టెక్కిస్తాయని నమ్ముతుంది. మరొకవైపు మరో మూడేళ్లు అధికారంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ఉండటంతో తమ నగరాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌కే ఓటేయడమని ప్రజల ఆలోచన ఉంటుందని హస్తం పార్టీ నేతలు భావిస్తున్నారు. దీంతో పాటు క్యాడర్ కూడా గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తుందని, అలాగే పట్టణ ఓటర్లు విజ్ఞతతో ఓటేస్తారని, అందుకే కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు పై ధీమాగా ఉంది. తమ నాయకత్వాన్ని కూడా పకడ్బందీగా రంగంలోకి దించింది.ఇక బీఆర్ఎస్ నాయకత్వం కూడా మున్సిపల్ ఎన్నికల్లో తమను ప్రజలు ఆదరిస్తారని భావిస్తుంది. పట్టణ ఓటర్లు చాలా తెలివిగా వ్యవహరిస్తారని, గత రెండేళ్లుగా ప్రభుత్వం వ్యవరిస్తున్న తీరుతో పాటు అవినీతి ఆరోపణలు, కుంభకోణాలు ప్రజల్లో పనిచేస్తాయని అంచనా వేస్తుంది. విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో తమకు తిరుగులేని ఆధిపత్యం దొరుకుతుందని భావిస్తుంది. మరొకవైపు పట్టణాల్లో తమకు తొలి నుంచి ఉన్న పట్టు ఖచ్చితంగా విజయావకాశాలను మెరుగు పరుస్తుందని చెబుతున్నారు. అయితే ఎలక్షనీరింగ్ చేయడమే ప్రధానమని, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావడమే అతి పెద్ద టాస్క్ అని కారు పార్టీ నేతలు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు.బీజేపీ కూడా ఈ మున్సిపల్ ఎన్నికలపై గంపెడాశలు పెట్టుకుంది. బీజేపీకి తొలి నుంచి పల్లెల కంటే పట్టణ ఓటర్ల మద్దతు ఎక్కువగా ఉంది. గత పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది పార్లమెంటు నియోజకవర్గాల్లో గెలుపునకు కూడా ప్రధాన కారణం పట్టణ ఓటర్లేనని అంటున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ వెయ్యికి పైగా సర్పంచ్ పదవులను కైవసం చేసుకున్నామని, ఇక పట్టణాల్లో కమలం జోరును ఆపడం ఎవరి తరమూ కాదని ఆ పార్టీ నేతలు విశ్వసిస్తున్నారు. కేంద్ర నాయకత్వం కూడా మున్సిపోల్స్ పై దృష్టి పెట్టి రాష్ట్ర నాయకులను అప్రమత్తం చేసింది.

# పరిహారం ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వండి సిగాచి ప్రమాద బాధితుల పరిహారం

హైదరాబాద్ భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వకపోవడం పై ప్రభుత్వం పై తెలంగాణ హైకోర్టు ఆసహనం వ్యక్తం చేసింది. పరిహారం ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వండని ఆదేశించింది. ఘటనలో మృతి చెందిన 56 మందికి, ఆచూకీ లభించని 8 మందికి, 28 మంది క్షతగాత్రులకు పరిహారం అందించడంతో పాటు, దర్యాప్తు కోసం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేయాలని హైకోర్టులో బాబురావు అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేసారు. ఈ పిటిషన్ విచారిస్తూ, పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు, ఎంత ఇస్తున్నారు, ఎప్పుడు ఇస్తారు అంటూ హైకోర్టు న్యాయమూర్తి ప్రశ్నించారు. పరిహారం పంపిణీకి సంబంధించిన అంశాలపై కంపెనీ వివరణ ఇవ్వాలని, దానికి సంబం ధించిన వివరాలను తెలియజేయాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కంపెనీ ప్రకటించిన పరిహారంతో పాటు, చట్టప్రకారం అందాల్సిన పరిహారం వివరాలను సమర్పించాలని ఈపీఎఫ్ హైదరాబాద్ రీజినల్ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర ఔషధ నియంత్రణ మండళ్లను హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుమోటో ప్రతివాదులుగా చేర్చి నోటీసులు జారీ చేసారు.

# ఖరీదయిన భూమిని ధారాదత్తం చేస్తున్నారు: వైకాపా

విశాఖపట్నం జనవరి 30,

గతంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పై రాద్ధాంతం చేసిన చంద్రబాబు, ప్రస్తుతం “చంద్రబాబు టైటిలింగ్ యాక్ట్” ద్వారా బంధువులకు, తన బినామీలకు 99 పైసలకే ప్రభుత్వ భూములు కట్టబెడుతున్నారని మాజీ మంత్రి, వైసీపినేత గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అంటే అప్పట్లో రాద్ధాంతం చేశారు.. ఇప్పుడు చంద్రబాబు టైట్లింగ్ యాక్ట్ వచ్చింది. చంద్రబాబుకు కావాల్సిన వారికి, బంధువులకు ఎంత చెబితే అంత ప్రభుత్వ భూమిని ఇచ్చేదయమే ఈ చంద్రబాబు టైట్లింగ్ యాక్ట్ అని అన్నారు మాజీ మంత్రి, వైసీపినేత గుడివాడ అమర్నాథ్. విశాఖపట్నం లాంటి నగరంలోని ఖరీదైన భూమిని ధారాదత్తం చేసే కార్యక్రమం జరుగుతోంది. దీన్ని వైయస్ఆర్సీపీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు.

# సమ్మక్క సారలమ్మ లకు మంత్రి పొన్నం ప్రత్యేక పూజలు

హుస్నాబాద్ భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

హుస్నాబాద్ నియోజకవర్గం సైదాపూర్ మండలంలోని జాగీరుపల్లి లో సమ్మక్క సారలమ్మ అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అమ్మవారికి నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకకున్నారు.

# మున్సిపల్ ఎన్నికలు సజావుగా సాగేందుకు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిఓ లు, ఏపిఓ లకు శిక్షణ కార్యక్రమం

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 30: మున్సిపల్ ఎన్నికల నిర్వహణను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు గాను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పి ఓ లు, ఏపిఓ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ శిక్షణకు సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్ హాజరై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి అధికారి ఎన్నికల నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియలో పారదర్శకత, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు.

పోలింగ్ రోజు ఎదురయ్యే వివిధ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ఎన్నికల సంఘం ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని వారు స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు శిక్షణలో భాగంగా ఎన్నికల అధికారులకు అవగాహన కల్పిస్తూ మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, న్యాయంగా ,ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడేందుకు పోలింగ్ ఆఫీసర్ (పిఓ) అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్ (ఏపిఓ) లు కీలక పాత్ర పోషిస్తారని, పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రంలో మొత్తం ప్రక్రియను సజావుగా నిర్వహించడం పిఓ యొక్క ప్రధాన బాధ్యత అని అన్నారు. ఓటింగ్ ప్రారంభానికి ముందు పోలింగ్ సామగ్రి సక్రమంగా ఉందో లేదో పరిశీలించడం, మాక్ పోలింగ్ నిర్వహించడం, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ లు సిద్ధం చేయడం వంటి బాధ్యతలు నిర్వహించాలని, ఓటర్ల గుర్తింపు, ఓటరు జాబితా ప్రకారం ఓటు హక్కు కల్పించడం, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం పిఓ ఏపిఓల సంయుక్త బాధ్యత. ఎన్నికల సమయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడటం, సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం కూడా వారి విధుల్లో భాగం అని, అలాగే పోలింగ్ ముగిసిన అనంతరం ఓటింగ్ యంత్రాలను సీల్ చేయడం, అవసరమైన పత్రాలను పూర్తిచేసి భద్రంగా స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం వంటి కీలక బాధ్యతలను కూడా పిఓ / ఏపిఓ లు నిర్వర్తిస్తారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల విశ్వసనీయతను కాపాడడంలో పిఓ, ఏపిఓ ల పాత్ర అత్యంత కీలకమైనదని వారి నిబద్ధత, పారదర్శకత తో ఎన్నికల ప్రక్రియ విజయవంతం చేయాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఈఓ రాజు, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ సంబంధిత ఎన్నికల అధికారులు, పిఓ ఏపిఓ లు పాల్గొన్నారు.



# సైబరాబాద్ పోలీసుల పటిష్ట పోలిసింగ్.. నేరాలకు కళ్లెం

సైబరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

సైబరాబాద్ పోలీసుల పటిష్ట పోలిసింగ్, నిరంతర నిఘా కారణంగా చైన్ స్నాచింగ్‌లు, ద్విచక్ర వాహనాల దొంగతనాలు, ఆలయాల్లో చోరీలు వంటి నేరాలు గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది గణనీయంగా తగ్గాయని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి తెలిపారు. సైబరాబాద్ పరిధిలో వాహనాల అపహరణ జరిగిన వెంటనే కేసులు నమోదు చేసి, సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ పాత నేరస్తులపై నేఘా ఉంచి వారి కదలికలను గుర్తించి వెంటనే అరెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాలకు వెళ్లి కూడా అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను చాకచక్యంగా అరెస్ట్ చేస్తున్నామన్నారు.

మచ్చుకు కొన్ని కేసులు:

కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌లో అరెస్ట్ చేశామన్నారు. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేజీల వెండి దొంగిలించిన అంతర్రాష్ట్ర ముఠాను రాజస్థాన్‌లో అదుపులోకి తీసుకున్నామన్నారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన ఢిల్లీకి చెందిన ముఠాను నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో అరెస్ట్ చేశామని స్పష్టం చేశారు.

అలాగే చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఖజానా జ్యువెలరీస్ దోపిడీ కేసులో పూణే (మహారాష్ట్ర), ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, బీహార్ తదితర రాష్ట్రాల్లో గాలించి నిందితులను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. జీడిమెట్లలో జరిగిన ఏటీఎం దొంగతనానికి సంబంధించిన అంతర్రాష్ట్ర ముఠాను హర్యానాలోని మేవాడ్ ప్రాంతంలో అరెస్ట్ చేశామని వివరించారు. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఆలయంలో జరిగిన చోరీ కేసులోనూ అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసి దేవాలయానికి చెందిన సొత్తును రికవరీ చేశామన్నారు. అంతర్రాష్ట్ర దొంగలను ఎక్కడ దాక్కున్నా వారిని గుర్తించి అరెస్ట్ చేయడమే సైబరాబాద్ పోలీసుల పనితీరుకు నిదర్శనమని డీసీపీ తెలిపారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ధన--మాన--ఆస్తి రక్షణకు సైబరాబాద్ పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉన్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని, ఏవైనా అనుమానస్పద కదలికలు ఉంటే వెంటనే డయల్ 100, 112 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.



# మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా విశ్రాంతి గది ప్రారంభం.

**-జిల్లా లో మహిళల భద్రతకు, రక్షణకు మొదటి ప్రాధాన్యత**
**-తలమడుగు పోలీస్ స్టేషన్ పరిశీలన.**
**-రిబ్బన్ కట్ నూతన గదిని ప్రారంభించిన మహిళా ఎస్ఐ డి రాధిక**
**-రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని సూచించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.**

ఆదిలాబాద్ జిల్లా, భారత శక్తి, జనవరి 30:

జిల్లాలో మహిళల భద్రత, రక్షణ చర్యలు పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు, జిల్లా పోలీసు యంత్రాంగం మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యతను కేటాయిస్తుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఈరోజు తలమడుగు పోలీస్ స్టేషన్ నందు మహిళా పోలీసు సిబ్బంది నిత్యవసర పనుల నిమిత్తం ప్రత్యేకంగా నూతన గదిని జిల్లా ఎస్పీ శాస్త్రోక్తంగా, వేద మంత్రోచరణల నడుమ ప్రత్యేకంగా మహిళా ఎస్సై చే రిబ్బన్ కట్ చేపించి నూతన గదిని ప్రారంభించారు. మహిళల భద్రత కై జిల్లాలో నూతనంగా మహిళ పోలీసు సిబ్బందిచే పెట్రోలింగ్ కార్యక్రమాలను త్వరలో ప్రారంభించనున్నట్లు, మహిళల రక్షణకై షీ టీం 24 గంటలు అందుబాటులో ఉంటూ రక్షణ చర్యలను చేపడుతున్నట్టు తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకై లిషీ టీంలి ఆధ్వర్యంలో పోలీసు అక్క ప్రారంభించి చిన్నారులకు మరింత దగ్గర అయిందని, మరియు ఆపరేషన్ జ్వాల కరాటే నందు శిక్షణ అందించడం జరిగిందని, మహిళల పట్ల జరుగు నేరాలపై పాఠశాలలు కళాశాలలు గ్రామ గ్రామాల మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ చైతన్య పరిచయం జరుగుతుందని తెలిపారు.



అదేవిధంగా తలమడుగు పోలీస్ స్టేషన్ ను పరిశీలించి రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు చేయాలని, ఎలాంటి పెండెన్సీ లేకుండా బాధితుల సమస్యల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరిస్తూ సిబ్బందిని కేటాయించి సమస్యల పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న కేసులు దర్యాప్తును పూర్తి చేసి కోర్టులలో చార్జిషీట్ దాఖలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కె ఫణిదర్, తాంసి ఎస్ఐ డి రాధిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడారంలో గద్దె పైన కొలువయిన సమ్మక్క తల్లి

మేడారం/ ములుగు జిల్లా ప్రతినిధి' జనవరి 30 (భారత శక్తి): చిలకల గట్టు నుండి ఆదివాసి సాంప్రదాయాలతో సమ్మక్క తల్లిని కుంకుమ బిరుడ రూపంలో పోలీస్ శ సమ్మక్క తల్లిని మేడారం జాతరలో గద్దెపైన కొలువయ్యారు. దీంతో మేడారం జాతరకు నిండుతనం వచ్చింది. దారి పొడవునా నీరాజనాలు భక్తుల కేరంతలతో తల్లికి స్వాగతం పలికారు. అద్వితీయమైన అనుభూతితో నిలువెల్లా పులకించి పోయారు. దారికి పొడవునా ఆదివాసి సాంప్రదాయ నృత్యాలతో ముందుకు సాగారు, సార బమ్మ తల్లి రూపాన్ని తాకాలన్న తపనతో వద్ద సమ్మక్క మేడారంవైపు సాగివస్తుండగా, కన్నెపల్లి ప్రయాణించే మార్గంలో కోళ్లు, మేకలను బలి ఇచ్చాడు. మొక్కులను సమర్పించుకున్నారు. "సమ్మక్క తల్లీ, మమ్మల్ని చల్లంగ చూడంటూ వేడుకున్నారు. చిలుకల గట్టు దారి పొడవునా భక్తులు బారులుతీరి నిల్చున్నారు. తల్లికి అడుగడు గునా నీరాజనాలు పలికారు.

చిలకల గట్టునుండి జయజయధ్వానాలతో అమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఇక్కడి నుంచి మేడారంలోని గుడికి సమ్మక్కను గురువారం తీసుకువచ్చారు. అప్పటికి మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి చేరిన పగిడిద్దరాజుతో పాటు గోవిందరాజుతో సహా సమ్మక్క గుడిలో పూజలునిర్వహించారు. పగిడిద్దరాజుకు, సమ్మక్కకు కళ్యాణం తంతు నిర్వహించారు. ఇది పూర్తయిన తర్వాత గోవిందరాజు, పగిడిద్దరాజు తోడు రాగా, సారలమ్మను మేడారం గద్దె వద్దకు పూజారులు చేర్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమం అనంతరం అమ్మను గద్దె పై ప్రతిష్ఠించారు. అదే ప్రాంగణంలో ఒకవైపు గోవిందరాజును, మరోవైపు పగిడిద్దరాజును వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గద్దెలపైకి చేర్చారు. గురువారం చిలుకల గట్టునుండి సమ్మక్క దేవతను ఆదివాసి సాంప్రదాయాల తో ఉంగరంగ వైభవంగా ఊరేగిస్తూ మేడారం సమ్మక్క గద్దె పైకి చేర్చారు. దీనితో మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర తుది ఘట్టం దిగ్విజయంగా ముగిసింది. పోలీసులు కూడా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, సమ్మక్క రాక సందర్భంగా భక్తులు పోటెత్తారు. సమ్మక్క సారలమ్మను, గోవిందరాజు. పగిడిద్దరాజును ఏకకాలంలో దర్శించుకొని తన్మయ త్వానికి లోనయ్యారు. ఈ నలుగురు దేవుళ్ళ గద్దెల ఆధునీకీకరణలో భాగంగా సమ్మక్కతో పాటు సారలమ్మ, గోవిందరాజులు పగిడిద్దరాజులను ఏక కాలంగా దర్శించుకోవడం భక్తులకు సులువైంది.



# 13 వార్డుకు నామినేషన్ దాఖలు చేసిన యువనేత నరేందర్ రెడ్డి




గుమ్మడిదల, భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

గుమ్మడిదల మున్సిపాలిటీ సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. మాజీ ఉపసర్పంచ్ ఎమ్మెన్నార్ యువసేన వ్యవస్థాపకులు మూడు చింతల నరేందర్ రెడ్డి 13వ వార్డు నుంచి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా క్షేత్రంలో సమస్యల పరిష్కారానికి వెన్నుదన్నుగా నిలుస్తూ ముందుకెళ్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు పథకాలు తన విజయానికి సోపానాలుగా మారుతాయని నరేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ జిల్లా(భారత శక్తి) జనవరి 30: మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ (ఫ్లీు), స్టాటిక్ సర్వైలెన్స్ (ఎూు) బృందాల సభ్యులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణలో, మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డి. హనుమంత్ నాయక్‌తో కలిసి ఆయన పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో ఫ్లీు, ఎూు బృందాల పాత్ర కీలకమని తెలిపారు. నగదు, మద్యం, బహుమతుల పంపిణీపై నిరంతర నిఘా ఉంచాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. ప్రతి తనిఖీని వీడియో రికార్డు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. శిక్షణ అనంతరం ఫ్లీు, ఎూు బృందాల కోసం కేటాయించిన వాహనాలను కలెక్టర్, సాధారణ పరిశీలకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనాలు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



# నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఈలా త్రిపాఠి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 30: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ వార్డు ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని శుక్రవారం ఇంచార్జి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఈల త్రిపాఠి సందర్శించి పరిశీలించారు.

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో గత బుధవారం నుంచి మూడు రోజులుగా నామినేషన్ల స్వీకరణ జరుగుతున్నదని తెలిపారు. ఈ ప్రక్రియను ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ల ఉపసంహరణ తేదీ 31వ తేదీ కాగా, తదుపరి ఫిబ్రవరి 11న జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు అందిన నామినేషన్ల సంఖ్య, నియమించిన ఆపరేటర్ల వివరాలు, అభ్యర్థుల సంఖ్య, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాల ఏర్పాటు, శిక్షణ తరగతుల నిర్వహణ, వెబ్‌కాస్టింగ్ సదుపాయం, ప్రింటింగ్ ప్రెస్ వివరాలు, బ్యాలెట్ బాక్సుల సరఫరా తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్, అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, ఆర్డీఓ వీణ, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, తహసీల్దార్ జితేందర్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పోరుమామిళ్ళ కుర్రోడు తీసిన ప్రేమ కడలి సినిమాకి కుటుంబ సమ్మేతంగా వెళ్లండి : నాగార్జున రెడ్డి



పోరుమామిళ్ళ, భారతశక్తి ప్రతినిధి, జనవరి 30: పోరుమామిళ్ల శ్రీ వెంకటేశ్వర సినిమా హాల్లో" ప్రేమ కడలి"సినిమా ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా రిలీజ్ అయింది. ఈ సినిమాలో నటించిన నటీనటుల ఆహ్వానం మేరకు మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి " ప్రేమ కడలి"మొదటి షోను చూడడం జరిగింది. ఈ సినిమా చూసిన తర్వాత నాగార్జున రెడ్డి మాట్లాడుతూ పోరుమామిళ్ల ప్రాంతానికి చెందిన బి కోడూరు మండలం పాయలకుంట్ల గ్రామానికి చెందిన పిల్లి బోయిన నాని, కాశీనాయన మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన ఎర్రి చెర్ల సుబ్బారెడ్డి నటించిన ఈ సినిమా కుటుంబ భరితంగా అందరూ చూడవలసిన సినిమా అని అన్నారు. ముఖ్యంగా నేటి యువత తప్పకుండా చూడవలసిన సినిమా అని పట్టుదల,కృషి ఉంటే ఏమైనా సాధించవచ్చు అని చెప్పే కథ నే ఈ సినిమా అని అన్నారు. గ్రామ ప్రాంతాల్లో న్యాచురల్ గా గ్రాఫిక్స్ లేకుండా, డూపులు లేకుండా, అశ్లీలంగా లేకుండా నిర్మించిన సినిమా ''ప్రేమ కడలి''ఇటువంటివే కుటుంబ సమేతంగా చూడదగిన సినిమాలు. ఈ మధ్యకాలంలో చాలా తక్కువ అని కావున మన ప్రాంతం అబ్బాయిలు నటించిన సినిమాను మన రాయలసీమ భాష సంప్రదాయాలతో ఈ సినిమాలో నటించిన నటీనటులకు మంచి చిత్రంలో బాగా నటించి నందులకు వారిని అభినందిస్తూ, ఈ సినిమాను అందరు చూసి వారిని ఆదరించి ఆశీర్వదించాలని, మీరు ఇంకా మంచి చిత్రాలు తీసి నటించి మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని నాగార్జున రెడ్డి కోరారు.

# మానవత్వానికి నిదర్శనంగా నిలిచిన పోలీస్ కానిస్టేబుల్

## CPR చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన వైనంలిసమయస్ఫూర్తితో విధులు నిర్వహించిన కానిస్టేబుల్ నవీన్‌ను సత్కరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జనవరి 30 (భారత శక్తి)

శుక్రవారం ఉదయం సుమారు 7:50 గంటల సమయంలో, భార్యాభర్తలు బైక్‌పై పోలీస్ పంపు వద్ద పెట్రోల్ కోసం వచ్చారు. పెట్రోల్ పోయించుకున్న అనంతరం ఆ వ్యక్తికి అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో బైక్‌పై నుండి కింద పడిపోయారు.

అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ నవీన్ అప్రమత్తమై, ఎటువంటి ఆలస్యం చేయకుండా తక్షణమే CPR (కార్డియో పల్మనరీ రిససిటేషన్) నిర్వహించి ప్రథమ చికిత్స అందించారు. కానిస్టేబుల్ నవీన్ చూపిన సమయస్ఫూర్తి, ధైర్యం, మానవత్వం వలన ఆ వ్యక్తి ప్రాణాలు నిలబడ్డాయి. ఈ సంఘటనను అభినందిస్తూ, విధుల్లో అప్రమత్తంగా, మానవత్వంతో వ్యవహరించిన కానిస్టేబుల్ నవీన్‌ను లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రత్యేకంగా సత్కరించారు.లి ఇటువంటి సేవలు ఇతర పోలీస్ సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు

# పోలీస్ కానిస్టేబుల్ సమయస్ఫూర్తి.

## - సీపీర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ నవీన్.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 30 (భారతశక్తి): సమయ స్ఫూర్తితో విధులు నిర్వహించిన కానిస్టేబుల్ ను అభినందించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల. శుక్రవారం ఉదయం సుమారు 7:50 గంటల సమయంలో, భార్యాభర్తలు బైక్‌పై పోలీస్ పంపు వద్ద పెట్రోల్ కోసం వచ్చారు.

పెట్రోల్ పోయించుకున్న అనంతరం, ఆ వ్యక్తికి అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో బైక్‌పై నుండి కింద పడిపోయారు.అదే సమయంలో డ్యూటీలో ఉన్న నవీన్ అనే పోలీస్ కానిస్టేబుల్ అప్రమత్తమై, ఎటువంటి ఆలస్యం చేయకుండా తక్షణమే జూ= (కార్డియో పల్మనరీ రిససిటేషన్) చేసి ప్రథమ చికిత్స అందించారు.కానిస్టేబుల్ నవీన్ చూపిన సమయస్ఫూర్తి, ధైర్యం, మానవత్వం వలన ఆ వ్యక్తి ప్రాణాలు నిలబడ్డాయి. తర్వాత ఆ వ్యక్తిని వెంటనే మరో వాహనం ద్వారా సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉ ంది.ఈ సందర్భంగా, విధిలో అప్రమత్తంగా కానిస్టేబుల్ నవీన్ చేసిన సేవలను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, పలువురు అభినందించారు.

# మనస్థాపం చెంది చెరువులో దూకిన బాలుడు సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన పోలీసులు

## సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 30 (భారతశక్తి): ముప్కాల్ గ్రామానికి చెందిన 17 ఏళ్ల రామ్ చరణ్ అనే బాలుడు ఇంట్లో జరిగిన గొడవల కారణంగా మనస్థాపం చెంది, నిర్మల్ పట్టణంలోని కంచరోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు.

ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని, స్థానిక జాలర్ల సహాయంతో చెరువులోకి దూకిన బాలుడిని సురక్షితంగా బయటకు తీసి, ప్రాణాలతో కాపాడారు.అనంతరం బాలుడిని టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి, అవసరమైన వైద్య సహాయం అందజేసి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రస్తుతం బాలుడు సురక్షితంగా ఉన్నాడు.ఈ సందర్భంగా, అప్రమత్తంగా విధులు నిర్వహించి బాలుడిని కాపాడిన టౌన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, పలువురు అభినందించారు.

# ప్రజలు సంతృప్తి చెందేలా ప్రభుత్వ సేవలు అందించాలి: జిల్లా జేసీ డా. నిధి మీనా



కడప, జనవరి 30(భారత శక్తి) : ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని కార్యక్రమాలపై ప్రజల నుండి సంతృని వ్యక్తం చేసేలా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా జేసీ డా. నిధి మీనా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుండి సానుకూల ప్రజా దృక్పథం, పీఆర్‌డఆర్‌డి, పంచాయతీ సేవలు, సివిల్ సప్లైస్, ఆర్‌డబి - ఏపీఎస్ఆర్టీసీ, రెవెన్యూ - రిజిస్ట్రేషన్ సేవలు, నీటిపారుదల - నీటిపారుదల నీటి సరఫరా, జీఎస్‌డబ్ల్యూఎస్ - జీఎస్‌డబ్ల్యూఎస్ సేవలు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా జేసీ డా. నిధి మీనా హాజరయ్యారు.సిఎస్ వీసీ ముగిసిన అనంతరం సంబంధిత అధికారులతో జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, ప్రత్యేక అమలు కార్యక్రమాలతో పాటు ప్రధానంగా పారదర్శకంగా పిజిఆర్ఎస్ అమలు, సజావుగా గ్యాస్ సరఫరా చర్యలు, ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణీకులకు సంతృప్తికరమైన సేవలు అందించడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ప్రజారోగ్యం, పారిశుధ్యం, సీజనల్ వ్యాధులపై దృష్టి, మాధకద్రవ్యాల నిరోధం, గ్రామవార్డు సచివాలయాల్లో సేవల మెరుగు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై క్రమం తప్పకుండా మీటింగ్స్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీవో హాజరతయ్య, సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ లను దర్శించుకున్న ప్రముఖులు









మేడారం/ ములుగు జిల్లా ప్రతినిధి, జనవరి 30 (భారత శక్తి) : మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో పలు ప్రముఖులు పాల్గొని అమ్మవార్లను దర్శనం చేసుకుని మొుక్కులు చెల్లించుకున్నారు.

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకునేందుకు శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, దంపతులతో, రాష్ట్ర పంచాయతీ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ కుటుంబ సమేతంగా,రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,

ఎంపీ బలరాం నాయక్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యులు గణేష్, భూపాల్ పల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ మేడారం జాతరను సందర్శించి మన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ముక్కులు చెల్లించుకున్నారు.

వీటితోపాటుపొలిటికల్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రఘురాం, రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా,బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ వుమెన్ అమ్మవారి దర్శనంచేసుకున్నారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ కు గద్దల వద్ద జరిగిన నూతన కట్టడాలు అభివృద్ధి గురించి అందులోని విశేషాలు గురించి మంత్రి సీతక్క వివరించారు.

# ఆధునిక వాస్తవిక కల్పన నవల

## గీతం కీలకోపన్యాసంలో పేర్కొన్న జేఎన్ యూ ఆచార్యుడు ప్రొఫెసర్ ఉదయ కుమార్



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 30:

భారతీయ నవల, సామాజిక వాస్తవికత, సామూహిక అనుభవంతో వేళ్లూనుకుందని, ముఖ్యంగా ఆధునిక వాస్తవిక కల్పనగా న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఆచార్యుడు ప్రొఫెసర్ ఉదయ కుమార్ అభివర్ణించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని ఆంగ్లం, ఇతర భాషల విభాగం ఆధ్వర్యంలో 'పరివర్తన దశ: భారతదేశంలో సాహిత్య సంస్కృతులు, సామాజిక-రాజకీయ ఉద్యమాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల చర్చాగోష్ఠిలో శుక్రవారం ఆయన కీలకోపన్యాసం చేశారు.సాహిత్యం అనే భావనను ఒక పరిమిత అభ్యాసంగా పేర్కొంటూ, ఇది స్థిర నిర్వచనాలను నిరోధించి, ఉన్నత వర్గాల మధ్య ఉంటుందని అన్నారు. సాహిత్యం గత శతాబ్దంన్నర కాలంలో పరిణామం చెందుతూ, ప్రజాక్షేత్ర విశ్వాసంపై ఆధారపడి, అనామక పాఠకులను ఉద్దేశించిందని చెప్పారు. భౌతిక, సామాజిక, సౌందర్యేతర పరిస్థితుల ద్వారా రూపొందించిన ఆధునిక నిర్మాణంగా ఇది ఉద్భవించిందన్నారు. సాహిత్యం యొక్క ఈ అవగాహన సమకాలీన కాలంలో గణనీయమైన పరివర్తనకు గురవుతోందని స్పష్టీకరించారు. మలయాళ సాహిత్యంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ, ముఖ్యంగా సి.అయ్యప్పన్, దళిత రచయిత రచనలను ఆయన ప్రస్తావించారు. 'పగటిపూట', 'రాత్రిపూట' కథనాల మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. ఈ రచనలు కేరళలో, ముఖ్యంగా కుట్టనాడ్ వంటి ప్రాంతాలలో కుల అణచివేత, సౌందర్య బానిసత్వం, సామాజిక బాధల చరిత్రలను ఎలా ప్రేరేపిస్తాయో ప్రొఫెసర్ కుమార్ వివరించారు. ఈ కథనాలు సమూహం యొక్క పరిశుభ్రమైన, లేదా జాతిపరమైన ప్రాతినిధ్యాలను ఎలా ప్రతిఘటిస్తాయో, సమ్మిళితత్వం, సామాజిక ఊహ యొక్క ఆధిపత్య భావనలను సవాలు చేసే సంక్లిష్టమైన, మూర్తీభవించిన సామాజిక అనుభవాలను ఎలా ఎలుగెత్తి చాటుతాయో విశ్లేషించారు.తొలుత, డాక్టర్ జోమీ అబ్రహం, అతిథిని పరిచయంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మండల్ వివరణతో ముగిసింది. జీఎస్‌హెచ్ఎస్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ ధరు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ప్రశ్నించి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టి వ్యాధి నివారణ పక్షోత్సవం



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 30: లెప్రసీ వ్యాధిపట్ల అపోహలు వద్దు శుక్రవారం జనవరి 30న 2026 మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని లింగంపేట్ పి హెచ్ సి లోని వండ్రికల్ లెప్రసి కాలనీ గ్రామంలో కుష్టి వ్యాధి వ్యతిరేక దినం సమావేశం నిర్వహించి కుష్టి వ్యాధి ఎలా సోకుతుంది వాటి లక్షణాల గురించి మాట్లాడి జనవరి 30ని కుష్టి వ్యతిరేక దినముగా భావించాలని మహాత్మా గాంధీజీ కుష్టి వ్యాధి నివారణకు చేసిన కృషి వ్యాధిగ్రస్తులకు చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన వర్ధంతి రోజైన జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు ఈ 15 రోజులు జిల్లా వ్యాప్తంగా ఈ స్పర్శ లెప్రసీ అవేర్నెస్ క్యాంపెయిన్(ఎస్ ఎల్ ఏ సి) నిర్వహించబడుతుందని తెలిపారు. అనంతరం కుష్టి వ్యాధి నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేసారు. కుష్టి వ్యాధి నివారణ పక్షోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలలో సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని సూచించారు. మన కామారెడ్డి జిల్లాను కుష్ఠు రహిత జిల్లాగా మార్చాలని చెప్పారు. లెప్రసీ కాలనీలోని రోగులకు దుప్పట్లు సెల్ఫ్ కేర్ కిట్స్ మందులు అందించారు. . ఈ కార్యక్రమంలో పిఓ డాక్టర్ జి ప్రదీప్ కుమార్, డిపిఎమ్ఓ కే. జీవన్, ఇన్చార్జ్ డెమో వేణుగోపాల్, ఇన్చార్జి డిపిహెచ్ఎన్ జానా భాయ్, రిటైర్డ్ డిపిఎంఓ లక్ష్మీనారాయణ, సర్పంచ్ చందన, సెక్రటరీ వెంకట్రామ చారి, లింగంపేట పిహెచ్ సి మెడికల్ అండ్ హెల్త్ స్టాప్ తదితరులు పాల్గొన్నారు.

# సినిమా

## సంక్రాంతి వార్



టాలీవుడ్ బాక్సాఫీస్ చరిత్రలో స్టార్‌డమ్‌తో పాటు పోటీని దశాబ్దాలుగా కొనసాగిస్తూ వస్తోన్న హీరోలుగా చిరంజీవి, బాలకృష్ణ ప్రత్యేక గుర్తింపు పొందారు. వీరిద్దరి సినిమాలు విడుదలైన ప్రతీసారి అభిమానుల్లో సహజంగానే పోలికలు, చర్చలు, అంచనాలు మొదలవుతాయి. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్చ నడుస్తోంది. ఇద్దరూ గ్యాంగ్‌స్టర్ నేపథ్య కథల్లో నటిస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. మెగాస్టార్ హీరోగా బాబీ కొల్లి తెరకెక్కిస్తున్న కొత్త చిత్రం గ్యాంగ్‌స్టర్ జానర్‌లో రూపొందనుందట. మాస్ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని పవర్‌ఫుల్ క్యారెక్టర్‌తో చిరును చూపించబోతున్నారని సమాచారం. ఈ చిత్రానికి 'కాకా' అనే టైటిల్ పరిశీలనలో ఉందన్న టాక్ కూడా ఈ వార్తలకి ఊతమిస్తోంది. అదే సమయంలో నటసింహ బాలకృష్ణ కూడా గ్యాంగ్‌స్టర్ కథతోనే ప్రేక్షకుల ముందుకు రానున్నారని వినిపిస్తోంది. వీరసింహారెడ్డి తర్వాత దర్శకుడు గోపీచంద్ మలినేనితో మరోసారి జట్టు కట్టేందుకు బాలయ్య సిద్ధమవుతున్నాడు. ఈ ప్రాజెక్ట్‌లో బాలయ్య పాత్ర మరింత రఫ్ అండ్ టఫ్‌గా, పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్‌గా ఉంటుందంటున్నారు. ఇద్దరి సినిమాలు ఒకే జానర్‌లో ఉండటమే కాకుండా 2027 సంక్రాంతికి విడుదలయ్యే అవకాశం ఉందన్న ప్రచారం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా

## కాటుక కండ్లతో

అనుపమ పరమేశ్వరన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తెలుగులో తన మొదటి సినిమాతోనే ప్రేక్షకుల్ని ఫిదా చేసింది ఈ మలయాళీ బ్యూటీ. . అందం, అభినయంతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. బ్యాక్‌టు బ్యాక్ మూవీస్‌తో తెలుగు, తమిళం, మలయాళంలో వరుస ఆఫర్స్ కొట్టేసింది. ఇటీవలే కిష్కింధపురి, బైసన్‌సినిమాలతో బ్లాక్ బాస్టర్ హిట్స్‌దక్కించుకుంది. అయితే గత కొంతకాలం కిందట ఇండస్ట్రీకి దూరమైన ఈ భామ మళ్లీ గట్టి కమ్ బ్యాక్ ఇచ్చింది. తాజాగా అనుపమ ప్రధాన పాత్రలో నటించిన ఎమోషనల్‌థ్రిల్లర్ లాక్‌డౌన్ ఇవాళ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇక సినిమాల సంగతి ఎలా ఉన్నా అభిమానులతో మాత్రం ఎప్పుడూ టచ్‌లోనే ఉంటుంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫొటోలు పంచుకుంది. అందులో కాటుక కండ్లతో ఫ్యాన్స్‌ను మాయ చేస్తోంది. వీటికి 'ఇప్పుడు అర్థమైంది.. అంతా ఎందుకలా జరిగిందో' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. అనుపమ షేర్ చేసిన ఈ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.



## 'నారీ నారీ నడుమ మురారి' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్.. స్ట్రీమింగ్ ఎక్కడంటే?



సంక్రాంతి కానుకగా విడుదలై, విజయం అందుకున్న కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'నారీ నారీ నడుమ మురారి'. ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో ఫిబ్రవరి 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు కన్నడ, తమిళం, మలయాళం, హిందీలోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుందని సదరు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. సంక్రాంతి బరిలోకి చివరిగా వచ్చిన (జనవరి 14న) ఈ చిత్రం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. ఇద్దరమ్మాయిల మధ్య నగిలిపోయే వ్యక్తిగా హీరో శర్వానంద్, హీరోయిన్లుగా సాక్షి వైద్య, సంయుక్త ఆకట్టుకున్నారు. సీనియర్ నటుడు నరేశ్, సత్య, సునీల్, వెన్నెల కిశోర్ తమ మార్క్ కామెడీతో అలరించారు. వినోదాత్మక కథలపై తనకెంత పట్టుందో దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాతో మరోసారి నిరూపించారు. ఈ సినిమా కథేంటంటే?: బీటెక్ చేసి ఆర్కిటెక్ట్‌గా పని చేస్తున్న కుర్రాడు గౌతమ్ (శర్వానంద్). నిత్య (సాక్షి వైద్య)తో ప్రేమలో ఉన్న తను.. ఇంట్లో వాళ్లను ఒప్పించి పెళ్లి పీటలెక్కాలని అనుకుంటాడు. ఈ పెళ్లికి తొలుత నిత్య తండ్రి రామలింగం (సంపత్ రాజ్) అడ్డు చెప్పినా.. తర్వాత అంగీకరిస్తాడు. ఆ పెళ్లి రిజిస్టర్ ఆఫీస్‌లో జరగాలని షరతు పెడతాడు. తప్పని పరిస్థితుల్లో దీనికి గౌతమ్ ఓకే అంటాడు. అలా పెళ్లికి దరఖాస్తు చేసుకున్నాక గౌతమ్‌కు ఓ అనుకోని చిక్కు ఎదురవుతుంది. దానికి, కాలేజీలో ప్రేమించిన దియా (సంయుక్త)కు ఉన్న సంబంధం ఏంటి? అసలు వాళ్లిద్దరూ ఎందుకు విడిపోవాల్సి వచ్చింది? ఈ రెండు ప్రేమకథల వల్ల గౌతమ్ తండ్రి కార్తీక్ (నరేశ్) పిన్ని పల్లవి (సిరి హనుమంతు) ల దాంపత్య జీవితం విడాకుల దాకా ఎందుకు వెళ్లింది? అన్నది మిగతా కథ.

## సినీరంగంలో రాజకీయ జోక్యం.. ప్రకాశ్‌రాజ్ కీలక వ్యాఖ్యలు



సినీ రంగంలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని సీనియర్ నటుడు ప్రకాశ్ రాజ్ అన్నారు. 17వ బెంగళూరు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఆయన చలన చిత్రోత్సవాల్లో రాజకీయ జోక్యం గురించి మాట్లాడారు. అలాగే, పాలస్తీనా సినిమాలను కూడా ఈ వేడుకల్లో ప్రదర్శించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది ఫెస్టివల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ప్రకాశ్‌రాజ్ పాలస్తీనా సినిమాల నిషేధంపై కర్ణాటక ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ''అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు, సాహిత్య ఉత్సవాల ఉద్దేశం విభిన్నమైన ఆలోచనలను పంచుకోవడమే. కానీ, అది గాడి తప్పుతోంది. ఇటీవల కాలంలో సినిమా, సాహిత్య రంగంలో రాజకీయ జోక్యం ఎక్కువైంది. ఈ కార్యక్రమాల్లో పాలస్తీనా సినిమాలను నిషేధించడం ఆమోదయోగ్యం కాదు. కేంద్రప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలి. కేరళ ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకొని ఆ సినిమాలను కూడా ప్రదర్శించింది. ఆ దిశగా కర్ణాటక ప్రభుత్వం కూడా అడుగులు వేయాలని కోరుకుంటున్నా'' అని ప్రకాశ్ రాజ్ అన్నారు. 17వ బెంగళూరు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు ఫిబ్రవరి 6 వరకు కొనసాగనున్నాయి. ఈ వేడుక ప్రారంభ కార్యక్రమంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ.. సమాజ ఉన్నతిని కాంక్షించి చిత్రాలు తీసేవారికి, కర్ణాటక చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని తెలిపారు.

## పుత్రుని కోసం..

సినిమా రంగంలో వారసత్వం అనేది కొత్త కాదు. కానీ తండ్రి దర్శకుడిగా మారి కొడుకును వెండితెరకు పరిచయం చేయడం అనేది ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన సంచలనమే. 1974లో ఎన్టీఆర్ దర్శకత్వంలో వచ్చిన తాతమ్మ కల సినిమాతో బాలకృష్ణ వెండితెరకు పరిచయమయ్యాడు. అలాగే హరికృష్ణ కూడా ఎన్టీఆర్ దర్శకత్వంలోనే బాలనటుడిగా మెరిశాడు. ఇదే బాటలో మంచు మోహన్ బాబు కూడా తన కుమారుడు విష్ణును విష్ణు సినిమాతో పరిచయం చేయగా, తమిళంలో టి.రాజేందర్ తన కుమారుడు శింబును చిన్నప్పుడే దర్శకుడిగా వెండితెరకు పరిచయం చేశాడు. ప్రస్తుతం సౌత్ ఇండియన్ స్టార్ హీరో ధనుష్ తన 16 ఏళ్ల కుమారుడు యాత్ర రాజాని హీరోగా లాంచ్ చేయడానికి సిద్ధమవుతున్నారనే వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ధనుష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నప్పటికీ.. మొదటగా యాత్రను లాంచ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ధనుష్ తాను ఇప్పటికే దర్శకత్వం వహించిన రాయన్, తేరే ఇష్క్ మే చిత్రాలు మంచి హిట్ అవ్వటంతో, తండ్రిగా తన కొడుకు కెరీర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దే బాధ్యతను భుజాన వేసుకున్నాడు.



## 'ఓటీటీలోకి 'ది రాజాసాబ్'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!



ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఫాంటసీ హారర్ కామెడీ చిత్రం 'ది రాజాసాబ్'. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా ఫిబ్రవరి 6 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మేరకు సంస్థ అధికారిక ప్రకటన చేసింది.

## నా కల నెరవేరిన క్షణాలు అవి: సారా అర్జున్

ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలోనే అగ్ర దర్శకుల సినిమాల్లో నటిస్తూ విజయాలు సొంతం చేసుకుంటున్నారు నటి సారా అర్జున్. ఇటీవలే 'ధురంధర్'తో భారీ హిట్ అందుకున్న ఆమె ప్రస్తుతం 'యుఫోరియా'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సారా అర్జున్ తన జీవితంలోనే ఆనందకరమైన రోజు గురించి మాట్లాడారు. ''పొన్నియిన్ సెల్వన్'లో నటించిన రోజులను ఎప్పటికీ మర్చిపోలేను. మణిరత్నం దర్శకత్వంలో నటించాలని కలలు కన్నాను. 'పొన్నియిన్ సెల్వన్'తో ఆ కల నెరవేరింది. అలాగే, 'ధురంధర్' సక్సెస్ కూడా నాకెంతో ప్రత్యేకం. నా తల్లిదండ్రులు ఆ సినిమా చూసి భావోద్వేగానికి గురయ్యారు. వాళ్లు ఎమోషనల్ అవడం చూసి నాకు ఆనందబాష్పాలు వచ్చాయి'' అని చెప్పారు. తన కెరీర్ గురించి మాట్లాడుతూ.. ''పొన్నియిన్ సెల్వన్' తర్వాత యాక్టింగ్‌ను మరింత మెరుగుపరచుకోవడం కోసం విదేశాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నా. కానీ, యుఫోరియా టీమ్ నన్ను సంప్రదించినప్పుడు ఆ కథ కచ్చితంగా ప్రస్తుత సమాజానికి అవసరం అనిపించింది. ఇలాంటి కథలో భాగమయ్యే అవకాశం కొంతమందికే వస్తుంది. అది నా అదృష్టం. నా కెరీర్ మొత్తం ఒక మ్యాజిక్‌లా ఉంది. మణిరత్నం దర్శకత్వంలో సినిమా తర్వాత 'యుఫోరియా'కు సైన్ చేయడం.. దీని షూటింగ్ జరిగే సమయంలోనే 'ధురంధర్'ను అంగీకరించడం.. అది భారీ విజయం అందుకోవడం అంతా మ్యాజిక్‌లా జరిగింది'' అని సారా వివరించారు.



# మేళ్ల చెరువులో హైడ్రా కంచె..!

* ఎఫ్టీఎల్ పరిధిలో మట్టి పూడ్చివేతపై చర్యలు..
* వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా ఫెన్సింగ్

హైదరాబాద్ జనవరి 30 (భారత శక్తి) : : సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ పరిధిలోని మేళ్ల చెరువు ఆక్రమణలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. చెరువు ఎఫ్టీఎల్ (పూర్తి స్థాయి నీటి మట్టం) పరిధిలో అక్రమంగా మట్టి పోయకుండా అడ్డుకట్ట వేసింది. సుమారు 108 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువులో మట్టి నింపడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయిందని, వరద నీరు వచ్చే మార్గాలను (ఇన్‌లెట్లను) మూసివేశారని స్థానికులు హైడ్రా 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. దీనిపై



మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సైతం హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

**సగానికి పైగా ఆక్రమణలు:**

ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. వేల లారీల మట్టి, బండరాళ్లతో చెరువును పూడ్చినట్లు గుర్తించారు. 108 ఎకరాల చెరువులో సగానికి పైగా మట్టి నిండిపోయిందని అధికారులు ధ్రువీకరించారు. ఎఫ్టీఎల్ పరిధిలోని భూముల్లో పంటలు పండించుకోవడానికి అనుమతి ఉన్నప్పటికీ, భూ స్వరూపాన్ని మార్చకూడదన్న నిబంధనలను ఉల్లంఘించడాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణించింది.

కంచె నిర్మాణం..

**నిందితులపై కేసులు:**

వరద నీరు రాకుండా నిర్మించిన అడ్డుగోడలను శుక్రవారం ఉదయం అధికారులు కూల్చివేశారు. సుమారు 40 ఎకరాల ఎఫ్టీఎల్ పరిధిలోకి మళ్లీ మట్టి రాకుండా మధ్యాహ్నానికల్లా ఫెన్సింగ్ పూర్తి చేశారు. అయితే, స్థానిక రైతుల వ్యవసాయ పనులకు ఇబ్బంది కలగకుండా రాకపోకలకు దారి వదిలారు. కేవలం మట్టి నింపకుండా మాత్రమే ఈ కంచెను ఏర్పాటు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు. చెరువును పూడ్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హైడ్రా నిర్ణయించింది.



## మేడారంలో హైడ్రా కమిషనర్
# రంగనాథ్ ప్రత్యేక పూజలు

ములుగు (మేడారం), జనవరి 30 (భారత శక్తి) : తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతరలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సందడి చేశారు. శుక్రవారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి వనదేవతలను దర్శించుకున్నారు.

* **మొక్కుల సమర్పణ.. లోక కల్యాణార్థం ప్రార్థన**

గద్దెల వద్దకు చేరుకున్న కమిషనర్ దంపతులకు ఆలయ పూజారులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ఆయన నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రంగనాథ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వనదేవతలను వేడుకున్నట్లు తెలిపారు.

* **సంస్కృతికి ప్రతీక మేడారం**

**"గిరిజన సంస్కృతి,**



సంప్రదాయాలకు మేడారం జాతర ఒక అద్దం పడుతుంది. ఇంతటి పవిత్రమైన ఉత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొనడం ఎంతో సంతోషాన్నిస్తోంది. భక్తుల మధ్య ఐక్యతను చాటిచెప్పే ఈ మహాజాతర ఆధ్యాత్మికతకు నిలువుటద్దం," అని ఆయన కొనియాడారు. జాతర ప్రాంగణంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి కూడా ఆయన ఆరా తీశారు.

# నిబంధనలు గాలికి.. ఆరు షోరూమ్‌ల సీజ్!

* రెండో రోజూ 'హైడ్రా' మెరుపు తనిఖీలు
* సెల్లార్లలో నిబంధనలకు విరుద్ధంగా గోదాములు
* ప్రమాదకర స్థితిలో ఫర్నీచర్ షాపులు.. చర్యలకు ఉపక్రమించిన అధికారులు

హైదరాబాద్, జనవరి 30(భారత శక్తి) : నగరంలో అగ్నిప్రమాదాల నివారణే ధ్యేయంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరమయ్యాయి. హైడ్రా, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక మరియు విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో రెండో రోజూ శుక్రవారం పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ, కనీస భద్రతా ప్రమాణాలు పాటించని ఆరు ప్రముఖ ఫర్నీచర్ షోరూమ్‌లను అధికారులు సీజ్ చేశారు.

**సెల్లార్లే అతి ప్రమాదం..**

తనిఖీల సందర్భంగా అధికారులు విస్తుపోయే నిజాలను గుర్తించారు. వినియోగదారుల పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్లను నిబంధనలకు విరుద్ధంగా గోదాములుగా మార్చడంపై అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదాలకు ఆస్కారం కల్పించేలా కెమికల్స్, పెయింట్ డబ్బాలు, పరుపులు, బ్యాటరీలను సెల్లార్లలో భారీగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ముఖ్యంగా గచ్చిబౌలిలోని 'లుకింగ్ గుడ్' ఫర్నీచర్ షాపులో సెల్లార్ ర్యాంపులను సైతం మూసేసి స్టాక్ నింపడం



గమనార్హం.

**లోపించిన భద్రత:**

పలు భవనాల్లో తనిఖీలు చేయగా.. కనీస అనుమతులు లేవని తేలింది. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తం చేసే స్మోక్ డిటెక్టర్లు, మంటలను ఆర్పే వాటర్ స్ప్రింక్లర్లు, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు లేకపోవడం అధికారులను విస్మయానికి గురిచేసింది.



* **సీజ్ చేసిన షోరూమ్‌ల వివరాలు:**

* గచ్చిబౌలిలోని లుకింగ్ గుడ్ ఫర్నీచర్ షాప్.
* కొంపల్లి క్రాస్ రోడ్స్ లోని అను ఫర్నీచర్.
* కూకట్‌పల్లి మరియు అత్తాపూర్ (పీవీ ఎక్స్‌ప్రెస్ వే) లోని రో యల్ ఓక్ షోరూమ్‌లు.
* ఉప్పల్ నాగోల్ లోని బాంటియా ఫర్నీచర్.
* నాచారంలోని అను ఫర్నీచర్.

**హైడ్రా హెచ్చరిక:**

షోరూమ్‌లను కేవలం వస్తువుల ప్రదర్శన కోసం మాత్రమే వినియోగించాలని, నిల్వ ఉంచేందుకు గోదాములను ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలని హైడ్రా స్పష్టం చేసింది. సీజ్ చేసిన షాపుల వద్ద 'ఫైర్ సేఫ్టీ లేని ప్రాంతం' అని పేర్కొంటూ బోర్డులు, బారికేడ్లను ఏర్పాటు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.



# ఆప్తమిత్రుడికి అశ్రునివాళి

: **కృష్ణ చౌదరి అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, మధుయాష్కి.**

హైదరాబాద్ : జనవరి 30 (భారతశక్తి): పలువురు ప్రముఖుల ఆప్తమిత్రుడు, దిల్సుఖ్ నగర్ నివాసి డాక్టర్ గారపాటి కృష్ణ చౌదరి (58) అంత్యక్రియలు శుక్రవారం జూబ్లీహిల్స్లోని మహాప్రస్థానంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. గురువారం సాయంత్రం ఆయన గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించడంతో మిత్రలోకంలో విషాదం నిండింది.

**వీడని ఢిల్లీ యూనివర్సిటీ అనుబంధం;**

ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ మరియు కృష్ణ చౌదరిలు ప్రాణమిత్రులు. ఒకే హాస్టల్ గదిని పంచుకున్న వీరు, నాటి నుంచి నేటి వరకు అదే అనుబంధాన్ని కొనసాగిస్తూ వచ్చారు. తమ చిరకాల మిత్రుడి అకాల మరణం పట్ల శ్రీధర్ బాబు, మధుయాష్కి తీవ్ర మనోవేదనకు గురయ్యారు.

* **అంతిమ యాత్రలో ప్రముఖులు:**

మహాప్రస్థానంలో జరిగిన అంత్యక్రియలకు హాజరైన మంత్రి శ్రీధర్ బాబు, మధుయాష్కి గౌడ్ మిత్రుడి పార్థివ దేహం వద్ద నివాళులర్పించి భావోద్వేగానికి లోనయ్యారు. కృష్ణ చౌదరి కుటుంబ సభ్యులను ఓదార్చి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీరితో పాటు ఢిల్లీ యూనివర్సిటీ నాటి మిత్రులు రిటైర్డ్ డీజీపీ ఎన్. ఆర్.కె. రెడ్డి, రిటైర్డ్ ఐజీ నవీన్ చంద్ తదితర ప్రముఖులు హాజరై తమ స్నేహితుడికి తుది వీడ్కోలు పలికారు. "విద్యార్థి దశ నుంచి మా మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమే కాదు, ఒక కుటుంబ బంధం. కృష్ణచౌదరిని కోల్పోవడం వ్యక్తిగతంగా మాకు తీరని లోటు" అని మిత్రులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు.




# ప్రగతి పథంలో హయత్‌నగర్

: **రూ. 20 లక్షలతో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం.**

హయత్‌నగర్, జనవరి 30 (భారత శక్తి) : హయత్‌నగర్ డివిజన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని సరోజినీ ఎంక్లేవ్ కాలనీలో సుమారు రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. సరోజినీ ఎంక్లేవ్‌లో నూతన రోడ్ల నిర్మాణంతో స్థానికుల దశాబ్దాల రవాణా కష్టాలు తీరతాయని, ప్రయాణం సులభతరం అవుతుందని పేర్కొన్నారు.

**నాణ్యతలో రాజీ పడొద్దు:**

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను విధిగా పాటించాలని నవజీవన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగితేనే డివిజన్ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నేతలు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, కాలనీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు సంక్షేమ సంఘం సభ్యులు శ్యామ్ ప్రసాద్, ప్రవీణ్, రవీందర్, బీజేపీ నాయకులు జాంజా నాయక్, ఎర్ర శ్రీకాంత్, బీజేవైఎం అధ్యక్షులు అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.





# మున్సిపల్ ఎన్నికల
## నామినేషన్ల దాఖలుకు ముగిసిన గడువు

హైదరాబాద్, జనవరి 30 (భారత శక్తి): తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసింది. చివరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. ఇవాళ సాయంత్రం 5 గంటలకు నామినేషన్ గడువు మగియగా.. అప్పటి వరకు క్యూలైన్‌లో ఉన్న వారిని నామినేషన్ వేసేందుకు అనుమతిస్తున్నారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు ఉంది. రాష్ట్రంలో మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు. మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదులకు ఎస్ఈసీ టీఈ పోల్ మొబైల్ యాప్ ఏర్పాటు చేసింది. tsec.gov.in ద్వారా కూడా ఫిర్యాదులకు అవకాశం కల్పించినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.

# ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని ఏసీపీకి సుధీర్ రెడ్డి ఆదేశం

ఎల్బీనగర్, జనవరి 30 (భారత శక్తి): వనస్థలిపురం డివిజన్ పరిధిలోని షాపింగ్ భవనాల వద్ద పలు టీ హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు తదితర విక్రయ కేంద్రాలు ఉండడం వల్ల ప్రతి రోజు ఉదయం నుండి మధ్య రాత్రి వరకు దాదాపు పదివేల మంది అక్కడకు రావడం జరుగుతున్న నేపథ్యంలో అక్కడికి వచ్చేవారు తమ వాహనాలు ఇష్టారీతిన పార్కింగ్ చేయడం వల్ల రోజంతా తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్ నందు గతంలో వేసిన డ్రైన్స్ చిన్నగా కావడం వల్ల ప్రతిరోజూ రోడ్డు మీద డ్రైన్స్ నిండి రోడ్డు మీద మురుగు నీరు పొంగి పొర్లుతున్నాయని తెలిపారు. అనంతరం సుధీర్ రెడ్డి ట్రాఫిక్ విషయంలో స్థానిక ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డికి ఫోన్ చేసి ఒకసారి అధికారులతో వనస్థలిపురం వెళ్లి పరిశీలించాలని కోరారు. అలాగే డ్రైన్స్ విషయంలో స్థానిక వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డికి ఫోన్ చేసి ఒకసారి అక్కడికి వెళ్లి తగు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, తప్పకుండా మీ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంజీవ్ రావు, విట్ట దుర్గయ్య, నయీమ్, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, గోవర్ధన్, లక్ష్మణ్, సునీల్ ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో మహారుద్ర సహిత సహస్రచండీ మహాయాగం

* రాగన్నగూడ పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత నర్సింహారెడ్డి.

తుర్కయంజాల్, జనవరి 30 (భారతశక్తి) : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ డివిజన్ రాగన్నగూడ సబ్ స్టేషన్ సమీపంలోని శ్రీ రేణుకా రాజరాజేశ్వరి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహారుద్ర సహిత సహస్రచండీ మహాయాగం శుక్రవారం కన్నులపండువగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.



**లోకకల్యాణం కోసమే యజ్ఞాలు:**

ఈ సందర్భంగా పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. లోకకల్యాణార్థం ఇలాంటి భారీ యాగాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యాగశాల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

* **ఆధ్యాత్మికతకు అద్దం పడుతున్న రాగన్నగూడ:**

గత కొన్ని రోజులుగా రాగన్నగూడ ప్రాంతం భక్తి పారవశ్యంలో మునిగితేలుతోంది. సహస్రచండీ యాగం వంటి శక్తివంతమైన క్రతువులను నిర్వహించడం ద్వారా స్థానికంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రజా ప్రాతినిధ్యం: రాజకీయ ప్రముఖుల రాకతో ఈ కార్యక్రమానికి మరింత ప్రాధాన్యత పెరిగింది. భక్తుల రద్దీ: తుర్కయంజాల్ పరిసర ప్రాంతాల నుంచే కాకుండా, నియోజకవర్గ నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. పీఠం నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పక్కా ఏర్పాట్లు చేశారు.



# గాంధీజీ సిద్ధాంతాలు విశ్వజనీనం

* నాంపల్లి గాంధీ దర్శన్‌లో వర్ధంతి వేడుకలు
* ఘనంగా నివాళులర్పించిన ప్రముఖులు

నాంపల్లి (హైదరాబాద్), జనవరి 30: మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస మార్గాలు ఎప్పటికీ ఆదర్శనీయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. జాతిపిత 78వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని 'గాంధీ దర్శన్'లో వివిధ గాంధేయ సంస్థల ప్రతినిధులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

**నేటికీ దిక్సూచి.. గాంధేయం:**

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో గాంధీజీ సిద్ధాంతాలు అత్యంత ఆవశ్యకమని అభిప్రాయపడ్డారు. నేడు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న 'స్వచ్ఛ భారత్' ఉద్యమమే ఆయన పరిశుభ్రత సిద్ధాంతానికి నిదర్శనమని కొనియాడారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి మహోద్యమాలను అహింసా మార్గంలో నడిపించి ప్రపంచానికే బాపూజీ మార్గదర్శిగా నిలిచారని గుర్తుచేశారు.

**యువత నడుం బిగించాలి:**

గాంధీజీ ఆశయాల సాధనకు యువత నడుం బిగించాలని, ఆయన సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో గాంధేయ సంస్థలు క్రియాశీల పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షులు జి.వి. సుబ్బారావు, కార్యదర్శి కోదాటి రంగారావు, గౌరవ సభ్యులు సూర్య నాయక్, గాంధీ దర్శన్ చైర్మన్ ఆదిత్య మార్గం పాల్గొన్నారు. అలాగే ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి.ఎన్. రాజేశ్వర్, ఉపాధ్యక్షులు సుఖేష్ రెడ్డి, ఆంధ్ర మహిళా సభ పూర్వ కార్యదర్శి పూర్ణచంద్రరావు, గాంధీ దర్శన్ కన్వీనర్ నాగసూరి వేణుగోపాల్, బి. ఆనంద్, మనీష్ చౌదరి, జీవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయని జయశ్రీ, సంగీత కళా బృందం ఆలపించిన గాంధీ ప్రార్థనా గీతాలు అలరించాయి.

## బడంగ్‌పేట్‌లో 'స్పెషల్ సానిటేషన్'
# డ్రైవ్.. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా తప్పదు..!

బడంగ్‌పేట్, జనవరి 30 (భారత శక్తి) : బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో శుక్రవారం సర్కిల్ 16 పరిధిలోని 60 డివిజన్లలో 'స్పెషల్ సానిటేషన్ డ్రైవ్' నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ పి. సరస్వతి పర్యవేక్షణలో ఈ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు.

**పార్కుల్లో కంపచెట్ల తొలగింపు**

ఉదయాన్నే క్షేత్రస్థాయిలోకి వెళ్లిన కమిషనర్






పారిశుద్ధ్య పనులను స్వయంగా పర్యవేక్షించారు. 60వ డివిజన్‌లోని మీర్‌పేట్ వెంకటసాయి ఎన్‌క్లేవ్ పార్కులో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను, కంపచెట్లను సిబ్బందితో కటింగ్ చేయించారు. పార్కులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

* **బాధ్యతారాహిత్యంపై కొరడా: రూ. 5 వేల జరిమానా**

రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను పారవేసే వారిపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. 62వ డివిజన్ బాలాపూర్ గణేష్ చౌక్ వద్ద ఒక వాహనంలో చెత్తను అడ్డగోలుగా తరలిస్తుండటాన్ని గమనించిన అధికారులు, వాహన యజమానికి అక్కడికక్కడే రూ. 5,000/ జరిమానా విధించారు. పట్టణాన్ని అపరిశుభ్రం చేస్తే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు ఎం. అభినయ్ కుమార్ (డిప్యూటీ ఈఈ), గంగా ప్రసాద్ (ఏఈ), యాదగిరి, నర్సింహా, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రాము మరియు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# తార్నాకలో రూ.27 లక్షలతో రోడ్డు పనులకు శ్రీకారం..

* ప్రారంభించిన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత

హైదరాబాద్, జనవరి 30 (భారత శక్తి) : స్థానిక డివిజన్ పరిధిలోని స్ట్రీట్ నంబర్ 1, జనరలేట్ లేన్‌లో చిరకాల వాంఛ అయిన రహదారి నిర్మాణానికి ముహూర్తం కుదిరింది. సుమారు రూ.27 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఆర్‌ఎంసీ (రెయిన్‌ఫోర్స్‌డ్ మెటల్ కాంక్రీట్) రోడ్డు పనులకు శుక్రవారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. నగరం డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి ఈ పనులను ప్రారంభించారు.

**మౌలిక వసతులే లక్ష్యం:**

ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. నగరంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

* నాణ్యతకు ప్రాధాన్యం: సుమారు 182 మీటర్ల పొడవునా, అత్యంత నాణ్య ప్రమాణాలతో ఈ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. శాశ్వత పరిష్కారం: వర్షాకాలంలో నీరు నిలవకుండా, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా దీర్ఘకాలిక మన్నిక కలిగిన ఆర్‌ఎంసీ సాంకేతికతను వాడుతున్నట్లు వివరించారు.
* ప్రజా సౌకర్యం: స్థానికుల విజ్ఞప్తి మేరకు, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన ఈ నిధులు మంజూరు చేసినట్లు ఆమె వెల్లడించారు.



ఈ కార్యక్రమంలో టీటీయూసీ జాతీయ అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి, తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రహదారి నిర్మాణంతో తమ ఏళ్లనాటి సమస్య తీరనుందని స్థానిక నివాసితులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, పార్టీ నాయకులు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు..

* నలుగురి అరెస్టు.. రూ. 2.04 లక్షల నగదు స్వాధీనం.
* చెంగిచెర్లలో వరుస దొంగతనాలకు పాల్పడిన కిలాడీలు..
* మేడిపల్లి పోలీసులు, మల్కాజ్‌గిరి సి.సి.ఎస్ బృందం సంయుక్త ఆపరేషన్

మేడిపల్లి, జనవరి 30 (భారత శక్తి): తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకొని అర్ధరాత్రి వేళ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను మేడిపల్లి పోలీసులు, మల్కాజ్‌గిరి సి.సి.ఎస్ (CCS) బృందం చాకచక్యంగా పట్టుకున్నారు. ముగ్గురు నిందితులతో పాటు దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన రిసీవర్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 2.04 లక్షల నగదు, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

**వరుస చోరీలతో కలకలం:**

పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 15, 16 తేదీల మధ్య రాత్రి చెంగిచెర్లలోని కనకదుర్గ కాలనీలో ఈ ముఠా వీరంగం సృష్టించింది. ఒకే రాత్రి ఏకంగా 9 ఇళ్ల తాళాలు పగులగొట్టి నగదు, బంగారు ఆభరణాలతో పరారయ్యారు. ఈ ఘటనలపై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి. వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనలకు గురికావడంతో రాచకొండ కమిషనరేట్ పోలీసులు ఈ కేసును సవాలుగా తీసుకున్నారు.

* **సాంకేతిక ఆధారాలతో వేట:**

ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఘటనా స్థలంలోని సిసిటివి దృశ్యాలను, సాంకేతిక ఆధారాలను విశ్లేషించారు. నిందితులు ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన వారుగా గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారిలో ప్రధాన నిందితులు మహాదేవ్ ఝా, పవన్ గుప్తా (ఢిల్లీ), మంగళ్ సింగ్ (కాన్పూర్, యూపీ) ఉండగా, చోరీ సొత్తును తీసుకున్న బీహార్‌కు చెందిన సీరం సావ్ బీరేంద్రను కూడా పట్టుకొని ట్రాన్సిట్ వారెంట్‌పై నగరానికి తరలించారు.

* **నేర చరిత్ర కలిగిన నిందితులు:**

ఈ ముఠాలోని ఏ1 నిందితుడు మహాదేవ్ ఝా గతంలో ఢిల్లీలో ఒక హత్య కేసులో మూడేళ్ల జైలు శిక్ష అనుభవించినట్లు పోలీసులు తెలిపారు. వీరిపై గతంలో ఢిల్లీలో ఆర్మ్స్ యాక్ట్, చోరీ కేసులు ఉండటమే కాకుండా.. వరంగల్, జనగామ, నల్గొండ జిల్లాల్లోనూ పలు దొంగతనాలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# లోక కల్యాణార్థం 'సహస్రచండీ మహాయాగం'

* రాగన్నగూడలో వైభవంగా క్రతువు.. పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

హయత్‌నగర్, జనవరి 30 (భారత శక్తి) : లోక కల్యాణం, దేశ, రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలను కాంక్షిస్తూ రాగన్నగూడలో నిర్వహించిన మహారుద్ర సహిత సహస్రచండీ మహాయాగం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది. శ్రీ రేణుక రాజరాజేశ్వరి పీఠం ఆధ్వర్యంలో, జగన్మాత సేవలో శ్రీ మెల్లూరి నవీన్ శర్మ పర్యవేక్షణలో ఈ ఆధ్యాత్మిక క్రతువును నిర్వహించారు. ఈ వేడుకలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, బీఎన్ రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





* **ఆధ్యాత్మికం.. సమాజానికి దిశానిర్దేశం: ఈటల**

ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం చేపట్టిన ఈ మహాయాగం ఎంతో శుభప్రదమని కొనియాడారు. జగన్మాత ఆశీస్సులతో దేశం, రాష్ట్రం శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజానికి సరైన దిశానిర్దేశం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ యాగం ప్రజల జీవితాల్లో శుభఫలితాలను తీసుకురావాలని కోరుకున్నారు. ఈ భారీ క్రతువును విజయవంతంగా నిర్వహించిన మెల్లూరి నవీన్ శర్మను, పీఠం నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, నాయకులు ఎర్ర శ్రీకాంత్, ఎర్ర ప్రేమ్, బీజేవైఎం అధ్యక్షుడు అఖిలేష్‌తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహాత్ముడికి ఘన నివాళులు అర్పించిన చిలుక మధుర ఉపేందర్ రెడ్డి

ఎల్బీనగర్, జనవరి 30 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా వాసవి కాలనీలో ఆధ్యాత్మిక కేంద్రంలోని మహాత్మా గాంధీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన చిలుక మధుర ఉపేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ఛైర్మెన్ తలాటి రమేష్ నేత, లింగస్వామి గౌడ్, ఎల్లన్న, వెంకటేశ్వర్లు, రాజు, రఘు, అనురాధ, రేణుక, శేఖర్, శశి యాదవ్, విప్లవ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



# గద్దెలపై కొలువైన వనదేవతలు



ములుగు, జనవరి 30 (భారత శక్తి): వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు-కుంకుమలే వజ్రాభరణాలుగా, బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా, చీర ముక్క-రైక బట్టలే సారెలుగా మారి తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవం — మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది. వన దేవత... మన దేవత... జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోట్లాది భక్తుల హృదయాలను ఏకం చేసే ఈ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జాతరకు దేశం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తజనం మేడారానికి తరలివస్తున్నారు.

*** భక్తులతో కిక్కిరిసిన జాతర ప్రాంగణం**

జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతోంది. ఎటు చూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. క్రమబద్ధంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో భక్తుల బారులు దర్శనానికి ఎదురుచూస్తుండగా, ప్రశాంత వాతావరణంలో తల్లుల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయి.

*** భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రిస్తున్న అధికార యంత్రాంగం**

భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి నెలకొనగా, గద్దెల వద్ద భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

*** వైద్య బృందాలు, వాలంటీర్లు అప్రమత్తం**

జాతర ప్రాంగణం అంతటా వైద్య బృందాలు అప్రమత్తంగా సేవలందిస్తుండగా, క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరంతరం భక్తులకు సహకారం అందిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా కొనసాగుతున్నాయి.

*** వన దేవతల సేవలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు**

మేడారం మహా జాతరకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సేవలందిస్తున్నారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద, క్యూ లైన్లలో భక్తులకు సహాయం చేయడం, జంపన్న వాగు వద్ద సూచనలు ఇవ్వడం, తప్పిపోయిన భక్తులను శిబిరాలకు చేర్చడం వంటి సేవలతో వాలంటీర్లు జాతరలో కీలక పాత్ర పోషిస్తున్నారు.





**ప్రముఖుల దర్శనాలు...**

ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ - నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ శివధర్ రెడ్డి - తల్లులను దర్శించుకున్నారు
- మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ - అమ్మవార్లను దర్శించుకున్నారు.
- మంత్రి శ్రీమతి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ శ్రీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ శ్రీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, శ్రీ పాయం వెంకటేశ్వర్లు, శ్రీ గండ్ర సత్యనారాయణ - అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

* బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు

**భక్తుల ప్రశంసల జల్లు**

ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనాలు మరింత సులభంగా, వేగంగా జరుగుతున్నాయని, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు. భక్తి, నమ్మకం, సంప్రదాయం, సంస్కృతి సమ్మేళనంగా... ప్రభుత్వ సమర్థ నిర్వహణతో... సజావుగా సాగుతున్న మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర.

# రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి..

## తొలి సీఎంగా చరిత్ర

అమెరికా, జనవరి 30 : రాజకీయాలు, పాలనా వ్యవహారాలతో అనునిత్యం ఎంతో బిజీగా ఉండే తెలంగాణ ముఖ్యమంత్రి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో 'లీడర్ షిప్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కాన్ఫ్లిక్ట్ అండ్ కరేజ్' ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న రేవంత్ కు హార్వర్డ్ అధ్యాపకులు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. అధికారంలో ఉండగానే ఈ సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయ ముఖ్యమంత్రిగా రేవంత్ చరిత్ర సృష్టించారు. ఈ ప్రోగ్రామ్ లో ప్రపంచ వ్యాప్తంగా 20కి పైగా దేశాల నుంచి 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జనవరి 25న ఈ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ప్రారంభమయింది. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుదీర్ఘంగా క్లాసులు జరిగాయి. ఈ శిక్షణలో రేవంత్ సాధారణ విద్యార్థిలా గడిపారు. 21వ శతాబ్దంలో ప్రపంచానికి ఎదురయ్యే సవాళ్లు, నాయకత్వ మెళకువలు, సంక్షోభ పరిస్థితులను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై కేస్ స్టడీలు, గ్రూప్ ప్రాజెక్టుల ద్వారా వీరికి శిక్షణ కొనసాగింది. మంచు తుపాను కారణంగా అక్కడి ఉష్ణోగ్రతలు 24 డిగ్రీలకు పడిపోయినప్పటికీ... విరామం తీసుకోకుండా రేవంత్ క్లాసులకు హాజరయ్యారు.

# ఫిబ్రవరి 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు...

## 14న బడ్జెట్!

కేరళ, జనవరి 30 (భారత శక్తి):ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. 16వ శాసనసభ ఐదో సమావేశాలను ఫిబ్రవరి 11వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అసెంబ్లీ సమావేశాలపై నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటలకు అమరావతిలోని వెలగపూడిలో ఉన్న అసెంబ్లీ హాలులో ఉభయ సభలను (శాసనసభ, శాసనమండలి) ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడంతో ఈ సమావేశాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. గవర్నర్ ప్రసంగం అనంతరం, సభలో ఆయనకు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఫిబ్రవరి 12న ఈ తీర్మానంపై చర్చ ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చర్చకు సమాధానం ఇస్తారు. ఈ సమావేశాల్లో అత్యంత కీలకమైన 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 14న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తారు. దాదాపు నాలుగు వారాల పాటు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌కు శాసనసభ ఆమోదం పొందడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశం.

# కేరళలో పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించిన టీమిండియా సభ్యులు

కేరళ, జనవరి 30 (భారత శక్తి): న్యూజిలాండ్‌తో జరగనున్న చివరి టీ20 మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ జట్టు సభ్యులు దైవదర్శనం చేసుకున్నారు. తిరువనంతపురంలోని చారిత్రక శ్రీ పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో జరగనున్న సిరీస్‌లోని ఆఖరి మ్యాచ్‌కు ముందు వారు స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, బ్యాటర్ రింకు సింగ్, స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి వెళ్లారు. ఈ సిరీస్ ఆరంభం నుంచి భారత ఆటగాళ్లు తరచూ ఆలయాలను సందర్శిస్తున్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన నాలుగో మ్యాచ్‌కు ముందు సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం జరుగుతున్న టీ20 సిరీస్‌ను భారత్ ఇప్పటికే 31 తేడాతో కైవసం చేసుకుంది. అయితే, బుధవారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 50 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో చివరి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను ఘనంగా ముగించాలని టీమిండియా పట్టుదలగా ఉంది. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న 2026 టీ20 ప్రపంచకప్‌కు సన్నాహాల్లో భాగంగా ఈ సిరీస్ జరుగుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్, ఈ టోర్నీలో తన తొలి మ్యాచ్‌ను అమెరికాతో ఆడనుంది.

# పదేళ్లలో అమరావతి, గుంటూరు, విజయవాడ కలిసిపోతాయి

అమరావతి, జనవరి 30 (భారత శక్తి): ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన గడ్డను మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు అందిస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన 'కానూరి జింఖానా' మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రం నిర్మాణం కోసం గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు ఏకంగా రూ.100కోట్లు విరాళంగా సమకూర్చగా, ప్రభుత్వం పరికరాలు, ఫర్నిచర్ కోసం మరో రూ.27 కోట్లు వెచ్చించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "సంపాదించిన దానిలో కొంత సమాజ సేవకు కేటాయించినప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిది. సమాజంలో ఇంకా మంచితనం మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారు. సాధారణంగా దశాబ్దాల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడిన వారు జన్మభూమిని మరచిపోతారు. కానీ మీరు చదువుకున్న కళాశాలను గుర్తుపెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థను ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేయడం అభినందనీయం. భవన నిర్మాణంతో పాటు, భవిష్యత్తులో దాని నిర్వహణకు ఆటంకాలు రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం మీ ముందుచూపునకు నిదర్శనం" అని ప్రశంసించారు.

**పేదల అభ్యున్నతికే 'పీ4'**

రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించే లక్ష్యంతోనే తాను 'పీ4' (ప్రజా భాగస్వామ్యంతో పేదరికంపై గెలుపు) కార్యక్రమాన్ని తీసుకొచ్చానని ముఖ్యమంత్రి వివరించారు. "కేంద్ర ప్రభుత్వం రహదారులు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాల కోసం పీ4 మోడల్‌ను ప్రోత్సహిస్తోంది. కానీ నేను పేదల అభ్యున్నతి కోసం పీ4ను అమలు చేస్తున్నాను. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు తగ్గుతాయి. చదువు అనేది ఒక గేమ్ ఛేంజర్. అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి మహనీయులు ఆర్థిక సాయంతోనే ఉన్నత స్థాయికి చేరారు. పీ4 కార్యక్రమం ద్వారా ఇప్పటికే 10.42 లక్షల మందిని లక్షా 2 వేల మంది దాతలు దత్తత తీసుకున్నారు. ప్రవాసాంధ్రులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై పేదలకు అండగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.

*** అమరావతిపై దార్శనికత.. అభివృద్ధిపై ధీమా**

రానున్న పదేళ్లలో గుంటూరు, అమరావతి ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. "గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు రానుంది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించాలన్నది నా లక్ష్యం. ఒకప్పుడు సైబరాబాద్ నిర్మించాం, ఇప్పుడు అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ'కి శ్రీకారం చుడుతున్నాం. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనతో ముందుకు వెళుతున్నాం" అని అన్నారు. 1995లో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చామని, నేడు దేశం విద్యుత్ రంగంలో అగ్రగామిగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు.

**ఆరోగ్య సేవల్లో 'సంజీవని' విప్లవం**

టెక్నాలజీని ఉపయోగించి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. "ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజలందరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం. ఇప్పటికే కుప్పంలో పైలట్ ప్రాజెక్టు పూర్తయింది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి దేశానికే ఆదర్శంగా నిలుస్తాం. 2026 నాటికి 72 లక్షల మంది రోగుల డేటాను సేకరించి, రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తాం. త్వరలో ఎయిర్ అంబులెన్సులు, 2026 నాటికి డ్రోన్ అంబులెన్సులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించారు.

**దాతృత్వానికి నిలువుటద్దం**

గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల దాతృత్వాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. 2.69 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 5 అంతస్తులుగా నిర్మించిన ఈ కేంద్రంలో మొత్తం 600 పడకలు ఉన్నాయి. కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ రూ.80 కోట్ల వరకు విరాళాలు సేకరించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. డాక్టర్ గవిని ఉమాదేవి (రూ.22 కోట్లు), నళినివెంకట్ తేళ్ల (రూ.8 కోట్లు) సహా పలువురు దాతలు భారీగా విరాళాలు అందించారు. నాట్కో ఫార్మా కూడా వివిధ అవసరాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# అసలు పని ఇప్పుడే మొదలైంది: మంత్రి నారా లోకేశ్

అమరావతి, జనవరి 30 (భారత శక్తి): "ప్రభుత్వంలోకి రావడంతోనే మా పని పూర్తికాలేదు, అసలు పని ఇప్పుడే మొదలైంది" అంటూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి, ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. శుక్రవారం కాకినాడ జేఎన్టీయూలో 'హలో లోకేశ్' పేరిట నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జేఎన్టీయూ ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థిని ప్రాప్తి యాంకర్ గా వ్యవహరించారు. జీవితంలో తీసుకునే కొన్ని నిర్ణయాలే భవిష్యత్తును నిర్దేశిస్తాయని, తన జీవితంలో పాదయాత్ర అలాంటి కీలక నిర్ణయమని లోకేశ్ అన్నారు. పాదయాత్ర ద్వారా కోట్లాది మంది ప్రజలు, యువత ఆశలు, ఆకాంక్షలు, సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభించిందని తెలిపారు. ఆ యాత్రలో తాను ఎంతో నేర్చుకున్నానని, నాటి అనుభవాలనే ఇప్పుడు ప్రభుత్వంలో అమలు చేస్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు 4 లక్షల ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. అభివృద్ధి వికేంద్రీకరణ, క్లస్టర్ ఆధారిత అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థుల నుంచి సూచనలు స్వీకరించేందుకు, వారి మనోగతాన్ని తెలుసుకునేందుకు ఇకపై ప్రతినెలా విద్యార్థులతో సమావేశం కావాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకుని, పాఠ్యప్రణాళిక మెరుగుదలకు ఉపయోగిస్తామని హామీ ఇచ్చారు. సీఎస్ఆర్ తరహాలో పరిశ్రమలు కూడా పరిశోధనలకు నిధులు కేటాయించాలని ఆయన సూచించారు. మనం ఏ స్థాయిలో ఉన్నా నైతిక విలువలను మరవద్దని విద్యార్థులకు హితవు పలికారు. పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని, అదే సమయంలో నైతిక విలువలు నేర్పించేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారుగా నియమించామని తెలిపారు. ఆయనకు కేబినెట్ ర్యాంకు ఇచ్చినా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సదుపాయాలు తీసుకోవడం లేదని గుర్తుచేశారు. 'అమ్మకు చెప్పలేని పని మనం చేయకూడదు' అనే చాగంటి మాట ఎంతో శక్తిమంతమైనదని లోకేశ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెట్టాలన్న లక్ష్యంలో విద్యార్థులంతా భాగస్వాములు కావాలని, వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు.

# సిగాచి బాధితులకు పరిహారం.. ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం



సంగారెడ్డి, జనవరి 30 (భారత శక్తి):సంగారెడ్డి జిల్లా సిగాచి ఫార్మా కంపెనీ ప్రమాద బాధితులకు పరిహారం చెల్లింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పరిహారం పంపిణీలో జాప్యం, స్పష్టత లేకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. గతేడాది సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో 56 మంది దుర్మరణం చెందగా, 8 మంది ఆచూకీ లభ్యం కాలేదు. మరో 28 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ బాధితులకు పరిహారం అందించాలని, ఘటనపై సిట్ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ బాబురావు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వ తీరును తప్పుబట్టింది. "పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు? ఎంత ఇస్తున్నారు? అసలు ఎప్పుడు ఇస్తారు?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. పరిహారం పంపిణీకి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కంపెనీని, ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అలాగే ఈ కేసులో ఈపీఎఫ్ హైదరాబాద్ రీజినల్ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలిని సుమోటోగా ప్రతివాదులుగా చేర్చింది. కంపెనీ ప్రకటించిన పరిహారంతో పాటు చట్టప్రకారం అందాల్సిన ప్రయోజనాల వివరాలను సమర్పించాలని వారికి నోటీసులు జారీ చేసింది.

# వీధి శుభ్రం చేసే చేతులు..
# ఐఐటీ శిఖరాలు చేరాలి

: **ఆర్.వి కర్ణన్. ఐఏఎస్**

హైదరాబాద్, జనవరి 30 (భారత శక్తి): నగర వీధులను రోజూ శుభ్రం చేస్తూ, అందరికీ ఆరోగ్యాన్ని పంచే పారిశుద్ధ్య కార్మికుల ఇళ్లలో విద్యా కాంతులు నింపేందుకు జీహెచ్ఎంసీ నడుం బిగించింది. వారి పిల్లలు కూడా దేశంలోనే అత్యున్నత విద్యా సంస్థల్లో చదువుకోవాలనే సంకల్పంతో, కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 31న (శనివారం) ఎంపిక చేసిన కార్మికుల పిల్లల కోసం 'ఐఐటీ హైదరాబాద్ ఎక్స్‌పోజర్ విజిట్' ఏర్పాటు చేశారు.



**కలలకు రెక్కలు తొడిగే ప్రయాణం:**

సాధారణంగా పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు ఇలాంటి ప్రతిష్టాత్మక సంస్థల వాతావరణం ఎలా ఉంటుందో అవగాహన ఉండదు. ఆ అడ్డంకులను తొలగించి, వారిలో ఆత్మవిశ్వాసం నింపడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ఐఐటీ హైదరాబాద్‌లోని ఈసెల్ (ECell) సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**పర్యటనలో ప్రధానాంశాలు:**

ప్రపంచ స్థాయి వాతావరణం: ఐఐటీలోని అత్యాధునిక ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఇన్నోవేషన్ సెంటర్ల సందర్శన.

నేరుగా మాటామంతీ: ఐఐటీ ప్రొఫెసర్లు, విద్యార్థులతో ముఖాముఖి చర్చలు.

గైడెన్స్: ఉన్నత విద్యకు ఎలా సిద్ధమవ్వాలి? ఎంట్రన్స్ పరీక్షలను ఎలా ఎదుర్కోవాలి? అనే అంశాలపై అవగాహన.




**అతిథులుగా వెళ్లనున్న చిన్నారులు**

**ఈ పర్యటన కేవలం ఒక విహారయాత్రలా కాకుండా, ఆ పిల్లలకు తాము ఎవరికీ తక్కువ కాదనే భావన కలిగించేలా ప్లాన్ చేశారు. కార్పొరేషన్ తరపున ప్రత్యేక రవాణా, భోజన వసతితో పాటు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలోని వివిధ సర్కిళ్ల నుంచి ఎంపికైన విద్యార్థులు రేపు ఉదయం ఐఐటీ క్యాంపస్‌కు బయలుదేరనున్నారు.**

**"నగరానికి వెన్నెముక పారిశుద్ధ్య కార్మికులే. వారి పిల్లల భవిష్యత్తు కూడా అద్భుతంగా ఉండాలి. పరిమితులు లేకుండా కలలు కనేందుకు ఈ పర్యటన ఒక చిన్న ప్రేరణ మాత్రమే."**

**— ఆర్.వి. కర్ణన్, జీహెచ్ఎంసీ కమిషనర్**

**నిజమైన 'స్వచ్ఛత' ఇదే..**

వీధులు ఊడ్చడమే కాదు, పేదరికపు చీకట్లను విద్యా అనే చీపురుతో తుడిచిపెట్టడమే అసలైన స్వచ్ఛత అని జీహెచ్ఎంసీ ఈ చర్య ద్వారా నిరూపిస్తోంది. పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాల్లో ఈ నిర్ణయం హర్షాన్ని నింపుతోంది.

---

* **22 భాషల్లో మేడారం చాటింపు.. కదిలిన 'ప్రపంచ పర్యావరణ సంస్థ'**
* **మంత్రులు సీతక్క, పొన్నం చేతుల మీదుగా జ్యూట్ బ్యాగుల పంపిణీ,**
* **అమ్మవార్ల సాక్షిగా పర్యావరణ పరిరక్షణ 'మహా యజ్ఞం'**

## వనదేవతల ఒడిలో ప్లాస్టిక్ రక్కసి వద్దు!

మేడారం, జనవరి 30 (భారత శక్తి): కోట్లాది మంది కొలిచే కంచుకమ్మల కాంతారంలో ప్లాస్టిక్ భూతాన్ని పారదోలేందుకు 'ప్రపంచ పర్యావరణ సంస్థ' శంఖారావం పూరించింది. వనదేవతల చెంతకు వచ్చే భక్తులకు పర్యావరణ స్పృహ కలిగించేలా వినూత్న రీతిలో అవగాహన కల్పించింది. దేశవ్యాప్తంగా వచ్చే భక్తులకు అర్థమయ్యేలా రాజ్యాంగం గుర్తించిన 22 భాషల్లో "మేడారాన్ని కాపాడుకుందాం" అని రాసి ఉన్న భారీ క్లాత్ బ్యానర్‌తో నిర్వహించిన ర్యాలీ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ (సీతక్క), పొన్నం ప్రభాకర్ పాల్గొని పర్యావరణ కార్యకర్తలను అభినందించారు.

* **అడవిని కాపాడుకుంటేనే మనకు మనుగడ: మంత్రి సీతక్క.**

మంత్రి సీతక్క మాట్లాడుతూ పర్యావరణ సంస్థ చేస్తున్న 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటాన్ని కొనియాడారు. "మన సంస్కృతికి మూలం ప్రకృతి. అడవి తల్లి సాక్షిగా ప్లాస్టిక్ రహిత జాతరగా మార్చడమే మనం అమ్మవార్లకు ఇచ్చే అసలైన మొక్కు. 22 భాషల్లో సందేశం ఇవ్వడం ద్వారా మేడారం విశిష్టతను దేశవ్యాప్తం చేస్తున్నారు" అని మెచ్చుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ భక్తులకు జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తూ, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లను త్యజించాలని కోరారు.




* **మూగజీవాల ప్రాణాలు తీస్తున్న ప్లాస్టిక్: జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర**

జాతర ముగిశాక మిగిలిపోయే ప్లాస్టిక్ వ్యర్థాలు అడవిలోని జంతువులకు శాపంగా మారుతున్నాయని సంస్థ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ తిని అడవిలోని మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని, భూసారం దెబ్బతింటోందని భక్తులకు వివరించారు. మల్టీ లింగ్యువల్ బ్యానర్: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వచ్చే భక్తులకు అర్థమయ్యేలా 22 భాషల్లో పర్యావరణ సందేశం. జ్యూట్ బ్యాగుల పంపిణీ: ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా మంత్రుల చేతుల మీదుగా బట్ట సంచుల పంపిణీ.

యూత్ ఫోర్స్: సంస్థ వాలంటీర్లు ఆర్టీసీ బస్టాండ్లు, గద్దెల వద్ద "సేవ్ మేడారం క్లీన్ మేడారం" అంటూ హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ భద్ర, జాతీయ కార్యదర్శి సాగర్, నిఖిల్ సాయి, రామకృష్ణ, యువరాజ్, సుమెర్ తదితరులు పాల్గొన్నారు.

---



## రాగన్నగూడలో వైభవంగా సహస్రచండీ యాగం

* **అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్**

హయత్ నగర్, జనవరి 30 (భారత శక్తి) : లోక కల్యాణం కోసమే కాకుండా, దేశ విదేశాల్లో ఉన్న ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని రాగన్నగూడలో నిర్వహిస్తున్న "మహారుద్ర సహిత సహస్రచండీ" మహాయాగం కన్నుల పండుగగా సాగుతోంది. శ్రీ రేణుక రాజరాజేశ్వరి పీఠం ఆధ్వర్యంలో శ్రీ మెల్లూరి నవీన్ శర్మ గారి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ జగన్మాత సేవలో శుక్రవారం మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈటలతో పాటు రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, బి.ఎన్. రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు



తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు వెంకట్ రామ్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు సురేష్ కుమార్ తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

---

## ఆరోగ్య మిత్రల కష్టాలకు 'మంత్రి' ముక్తి..
## దామోదర రాజనర్సింహకు గిరి యాదయ్య కృతజ్ఞతలు!

హైదరాబాద్, జనవరి 30 (భారత శక్తి) : ఏండ్ల సంది కొట్లాడుతున్న ఆరోగ్య మిత్రల గోస ఎట్టకేలకు తీరింది. తమ న్యాయమైన డిమాండ్ల కోసం రోడ్డెక్కిన ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఉద్యోగులకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ భరోసానిచ్చారు. చెప్పినట్టే ఫైళ్ల మీద సంతకాలు పెట్టిచ్చి, ఆరోగ్య మిత్రల జీవితాల్లో వెలుగులు నింపినందుకు ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య మంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**ఆనాడు సమ్మె.. ఈనాడు సంతోషం**

గత ఏడాది సెప్టెంబర్ 18న రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య మిత్రలందరూ కలిసి విధులను బహిష్కరించి సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. అప్పుడు మంత్రి గారు పెద్దన్నలా ముందుకొచ్చి, ఆగస్టు 20నే యూనియన్ నాయకులతో ముచ్చటపెట్టి.. "మీ సమస్యలు నా సమస్యలే, త్వరలోనే పరిష్కరిస్తా" అని హామీ ఇచ్చారు. మంత్రి మాట మీద నమ్మకంతోనే ఉద్యోగులు సమ్మె విరమించి



విధుల్లో చేరారు. ఇచ్చిన మాట తప్పకుండా, ఇప్పుడు ఆరోగ్య మిత్రలకు D.E.O (డాటా ఎంట్రీ ఆపరేటర్) క్యాడర్ స్ట్రెంత్ కల్పిస్తూ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి అప్రూవల్ ఇప్పించారు.

* **మారిన బతుకు చిత్రం:**
* కేవలం క్యాడర్ మాత్రమే కాకుండా, పని వేళల్లోనూ మంత్రి గారు కీలక మార్పులు తీసుకొచ్చారు.
* ఎనిమిది గంటల పని: పొద్దున్న పోతే రాత్రి దాకా సచ్చే చాకిరీ కాకుండా, పక్కాగా 8 గంటల పని విధానాన్ని అమలులోకి తెచ్చారు.
* సెలవుల ఊరట: అప్పుడప్పుడు పనుల కోసం, ఆరోగ్యం బాలేనప్పుడు వాడుకోవడానికి సాధారణ సెలవులు (Casual Leaves) కూడా మంజూరు చేశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో గిరి యాదయ్య బృందం దామోదర రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలియజేసింది.

* **ఇంకా తీరాల్సిన ముచ్చట్లు కొన్ని..**



మంత్రి చేసిన మేలును మెచ్చుకుంటూనే, మరికొన్ని సమస్యలను కూడా గిరి యాదయ్య ఆయన దృష్టికి తీసుకపోయారు.

* **ట్రస్టు ఉద్యోగులుగా గుర్తింపు:**
* భవిష్యత్తులో ఆరోగ్య మిత్రలను నేరుగా ఆరోగ్యశ్రీ ట్రస్టు ఉద్యోగులుగానే పరిగణించాలి.
* ఖాళీల భర్తీ: డిపార్ట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న పోస్టులన్నిటిని వెంటనే నింపాలి. ఏరియర్స్ కల్పించాలి.
* ఎక్స్ గ్రేషియా: విధి నిర్వహణలో ఉండి ఎవరైనా ఆరోగ్య మిత్రలు చనిపోతే, వారి కుటుంబాలకు 50 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా అందించి ఆదుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షులు సుమన్, కమిటీ సభ్యులు కిషోర్, రత్నం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. మంత్రి గారు స్పందిస్తూ.. రాబోయే రోజుల్లో మిగతా సమస్యలను కూడా సానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

---

## మతోన్మాద శక్తులపై
## కొట్లాడడమే గాంధీజీకి ఇచ్చే నిజమైన నివాళి

* **రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో బాపూజీ వర్ధంతి**



హస్తినాపురం, జనవరి 30 (భారత శక్తి) : దేశంలో పెచ్చుమీరుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా అందరూ ఏకం కావడమే మహాత్మా గాంధీకి ఇచ్చే నిజమైన నివాళి అని రాజ్యాంగ పరిరక్షణ వేదిక సెక్రటరీ చెన్నోజు శ్రీనివాసులు అన్నారు. హస్తినాపురంలో శుక్రవారం రోజున రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతిని 'మతోన్మాద వ్యతిరేక దినం'గా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ.. మత సామరస్యం కోసం పాకులాడిన మహాత్ముడిని హిందూ మతోన్మాద శక్తులు దారుణంగా పొట్టనబెట్టుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో అవే శక్తులు అధికారంలో ఉండి ప్రజల మధ్య విషం చిమ్ముతున్నాయని, లౌకికత్వాన్ని దెబ్బతీస్తున్నాయని మండిపడ్డారు. మతోన్మాద, మతాధిపత్య రాజకీయాలు నశించాలని, శాంతి సామరస్యాలు వర్ధిల్లాలని ఈ సందర్భంగా నినాదాలు చేశారు.

**ఉపాధి హామీ పేరు మార్చొద్దు..**

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చాలని చూడటం సరికాదని, ఆ పేరును అలాగే కొనసాగించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో బైండ్ల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నందిగామ వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పొట్టపెంజర రమేష్, బుడిగపాక గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.